రేపట్నుంచి జాతీయ స్థాయి 'టెన్నిస్' 6

భార్యను కొట్టి చంపిన భర్త 7

బాలికపై లైంగిక దాడి కేసులో జీవిత ఖైదు

గుండెపోటుతో ఇద్దరి మృతి 7



ఏసీబీ అధికారులకు చిక్కిన ఏవో శంతనకుమార్

చెమట చుక్కల్లోనూ
కాసుల వేట

- టీఆర్ ఇవ్వడానికి పత్తి రైతుకు ఏవో లంచం వేధింపులు
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రూ.30 వేలు పుచ్చుకున్న వెంటనే పట్టుకున్న అధికారులు
- అశ్వాపురం వ్యవసాయ అధికారి కార్యాలయంలో కలకలం
- టీఆర్‌ల కుంభకోణంపై విచారణ అధికారిగా వున్న ఏవో

అశ్వాపురం ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించి పంట పండించే రైతునూ వదల్లేదు ఆ అధికారి. ముడుపులిస్తేనే తాత్కాలిక రిజిస్ట్రేషన్ (టీఆర్) పత్రం ఇస్తానని మెలికపెట్టడంతో సదరు రైతు ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో పథకం ప్రకారం ఏసీబీ అధికారులు వలపన్ని అవినీతి అధికారిని పట్టుకున్నారు. ఈ సంఘటన అశ్వాపురంలోని మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం చోటుచేసుకుంది. మండలంలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఓ రైతు నుంచి రూ.30వేల లంచం తీసుకుంటూ మండల వ్యవసాయాధికారి(ఏవో) సాయిశంతన్ కుమార్ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి...

రామచంద్రాపురానికి చెందిన ఓ రైతు పత్తి పంట పండించాడు. పాస్ పుస్తకం లేకపోవడంతో పంట విక్రయం కోసం టీఆర్ (తాత్కాలిక రిజిస్ట్రేషన్) కావాలని వారం రోజుల క్రితం ఏవో సాయిశంతన్‌కుమార్‌ను ఆశ్రయించాడు. కష్టంపై బతికే రైతు అని చూడకుండా ఏవో రూ.30వేలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. తాను అంత ఇచ్చుకోలేనని చెప్పినా వినిపించుకోలేదు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారు ఏవోపై పూర్తి నిఘా ఏర్పాటు చేసి సంభాషణల ఆడియో, వీడియో రికార్డులను సేకరించారు. ముడుపుల కోసం వేధిస్తున్నాడని నిర్ధారణ అయిన తర్వాత పక్కా ప్లాన్ రచించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు రైతు గురువారం (మిగతా 6వ పేజీలో)

వీళ్లే ఆ దోపిడీ దొంగలు..?





పోలీసులు విడుదల చేసిన అనుమానితుల ఫొటోలు ఇవే..

- వైరా ఘటనలో నిందితుల ఫొటోలు విడుదల
- పౌరులు సమాచారం ఇవ్వాలని పోలీసుల విజ్ఞప్తి

వైరా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైరాలో ఈనెల 12న పట్టపగలు ఒంటరి వృద్ధ మహిళను బంధించి దోపిడీకి పాల్పడిన ఘటనలో అనుమానితులు, వారు ఉపయోగించిన కారు ఫొటోలను గురువారం వైరా పోలీసులు విడుదల చేశారు. వైరాలో సర్వే పేరుతో వచ్చిన నలుగురు దుండగులు శీలం వెంకట్రావమ్మ అనే వృద్ధ మహిళను పట్టపగలే నిర్బంధించి రూ.15లక్షల విలువైన 18తులాల బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన విషయం విదితమే. పోలీసులు తమ దర్యాప్తులో భాగంగా అనుమానితుల ఫొటోలను సేకరించి విడుదల చేశారు. దుండగులు తెలుపురంగు కారులో వచ్చి దోపిడీకి పాల్పడ్డారు. ఈ నలుగురిలో ఒకరు పోలీస్ యూనిఫాం



పోలీసులు గుర్తించిన కారు

ధరించాడు. సర్వే గురించి వచ్చిన వారిలా మాట్లాడి ఆమెను ఇంట్లోకి నెట్టివేసి కాళ్లు, చేతులు, నోరును ప్లాస్టర్‌తో చుట్టి కట్టివేసి ఇంట్లో ఉన్న సొత్తును దోచుకొని వచ్చిన కారులోనే పారిపోయారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నలుగురు దుండగుల ఫొటోలను గుర్తించి విడుదల చేశారు. అలాగే ఐదో వ్యక్తి దోపిడీ ప్రాంతానికి బయట సంచరించినట్టు పోలీసులు గుర్తించారు. దుండగులను ఎవరైనా గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని, తగిన పారితోషికం ఇస్తామని వైరా ఏసీపీ రహమాన్ తెలిపారు. ఏసీపీ వైరా 8712659146, సీఐ వైరా 8712659147, ఎస్‌హెచ్‌వో వైరా 8712659148 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



శాసన మండలి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల పరిధి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ వివిధ ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘాలు, బీజేపీ ఎన్నికల ప్రచారాలను ఉధృతం చేశాయి. పోలింగ్ ఈ నెల 27న జరగనుంది. ప్రచారాలకు కేవలం 5 రోజులే మిగిలి ఉంది. దీంతో పోటీలో ఉన్న అభ్యర్థులు గెలుపుకోసం తీవ్రస్థాయిలో యత్నాలు చేస్తున్నారు.

బరిలో ఉన్న అభ్యర్థులు వీరే..

- అలుగుబెల్లి నర్సిరెడ్డి
- పులి సరోత్తంరెడ్డి
- యస్.సుందర్‌రాజ్
- గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి
- అర్వ స్వాతి
- పన్నాల గోపాల్‌రెడ్డి
- తలకోల పురుషోత్తంరెడ్డి
- తాటికొండ వెంకటరాజయ్య
- చాలిక చంద్రశేఖర్
- పింగిలి శ్రీపాల్‌రెడ్డి
- పూల రవీందర్
- కొలిపాక వెంకటస్వామి
- లింగిడి వెంకటేశ్వర్లు
- కంటే సాయన్న
- యేలె చంద్రమోహన్
- దామెర బాబురావు
- బంక రాజు
- జంగిటి కైలాసం
- జె.శంకర్

గురువుల పోరు
ప్రచార హోరు

- 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు
- జోరుగా సాగుతున్న ప్రచార పర్వం
- 12 జిల్లాల పరిధిలో విస్తరించిన నియోజకవర్గం
- ఎన్నికల బరిలో 19 మంది అభ్యర్థులు
- ఓటేయనున్న 25,797 మంది
- ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 6,111 మంది ఓటర్లు
- హన్మకొండ జిల్లాలో అత్యధికం.. సిద్దిపేట జిల్లాలో అత్యల్ప ఓటర్లు
- ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఒక్కరూ బరిలో లేని వైనం

ఇల్లెందు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రాధాన్యత క్రమంలో జరిగే ఓటింగ్ కారణంగా అభ్యర్థులు 1వ, 2వ ప్రాధాన్యత ఓట్ల కోసం ఉపాధ్యాయులను వివిధ రీతుల్లో అభ్యర్థిస్తున్నారు. ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే జిల్లా నియోజకవర్గాల స్థాయి సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయ ఓటర్లను ఇంటింటికి వెళ్లి కలుస్తూ ఓట్లు వేయాలని కోరుతున్నారు. వివిధ యాజమాన్యాల ఉపాధ్యాయుల్లో దాదాపు 60కి పైగా ఉపాధ్యాయ సంఘాలు ఉండటంతో అభ్యర్థులు వారి మద్దతుదారులను, ఆయా సంఘాల మద్దతును కూడకట్టడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నారు. కొన్నేళ్లుగా ఉపాధ్యాయుల్లో సైతం కులాల వారీగా సంఘాలు ఆవిర్భవించడంతో వారిని ఆకట్టుకునేందుకు జోరుగా మంతనాలు సాగిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే పోటీ చేసేందుకు నిర్ణయించుకున్న ఉపాధ్యాయ



ఉపాధ్యాయ ఓటర్లు

జిల్లా	మహిళా ఓటర్లు	పురుష ఓటర్లు	మొత్తం ఓటర్లు
భద్రాద్రి కొత్తగూడెం	954	1068	2022
ఖమ్మం	1717	2372	4089
సిద్దిపేట	43	123	166
జనగాం	388	614	1002
హన్మకొండ	2272	2943	5215
వరంగల్	878	1474	2352
మహబూబాబాద్	551	1112	1663
భూపాలపల్లి	114	215	329
ములుగు	223	405	628
యాదాద్రి భువనగిరి	346	638	984
సూర్యాపేట	962	1702	2664
నల్లగొండ	1866	2817	4683
మొత్త ఓటర్లు	10314	15483	25797

సంఘాలు, అభ్యర్థులు ప్రచారాలు ప్రారంభించారు. 12 జిల్లాల వ్యాప్తంగా విస్తరించి వున్న నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో పోటీలో ఉన్న అభ్యర్థులు కీలక సమావేశాల్లో జిల్లా కేంద్రాల సభల్లో పాల్గొంటుండగా.. మద్దతునిస్తున్న సంఘాలు కొన్ని పార్టీల నాయకులు, (మిగతా 6వ పేజీలో)



కూసుమంచిలో కోతుల గుంపు

ఓటు కోసం 'కోతి' తిప్పలు

- 'స్థానికం'లో అభ్యర్థులకు సవాల్‌గా కోతుల బెడద
- సమస్య తీర్చే వారికే ఓటేస్తామంటున్న జనం

కూసుమంచి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కోతుల బెడద ఎక్కువగా ఉంటోంది. వందల సంఖ్యలో ఉన్న వాటి సమస్య గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేద్దామనుకునే వారికి ఈ కోతులు కొత్త తిప్పలు తెచ్చిపెడుతున్నాయి. కోతుల బెడద తీరిస్తేనే ఓటేస్తామంటూ ఓటర్లు పట్టుబడుతున్నారు. వాట్సాప్ సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఊర్లో రోడ్లు, డ్రైనేజీల సమస్యలు పక్కనపెట్టి కోతులను వెళ్లగొడతాం ఓటేయండి అంటూ ఆశావాహులు ప్రచారం మొదలు పెడుతున్నారు. మరికొద్ది రోజుల్లో పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికల ఢంకా మోగనుంది. అయితే దాదాపు అన్ని గ్రామాల్లోనూ కోతుల బెడదతో కొన్నాళ్లుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లను లూటీ చేస్తున్నాయి. అటు పంటపొలాలను నాశనం చేస్తూ రైతులను ఆర్థికంగా నష్టం చేస్తున్నాయి. పండ్లు, కూరగాయలు, వరి, మొక్కజొన్న, కంది, శనగ పంటలన్నీ ధ్వంసం చేస్తున్నాయి. మామిడిపండ్లు, కూరగాయల తోటల్లో గాలిదుమారం కంటే కోతుల మందపడితేనే అధిక నష్టమే ఎక్కువగా ఉంటోందని రైతులు వాపోతున్నారు. దీంతో ఈసారి ఎన్నికల్లో కోతుల సమస్యే ప్రధానంగా ప్రచారంతో దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. కోతుల బెడదను తప్పించిన వారినే గెలిపిస్తామంటూ తెగేసి చెపుతున్నారు.

జై హనుమాన్..

- 23న నగరంలో శతసహస్ర హనుమాన్ చాలీసా పారాయణం
- పేర్ల నమోదుకు భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రత్యేక కౌంటర్

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మానికి చెందిన శ్రీ స్తంభాద్రి ఆధ్యాత్మిక సమితి ఆధ్వర్యంలో ఈనెల 23న నగరంలోని పెవిలియన్ గ్రౌండ్‌లో శతసహస్ర హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు వి.వెంకటేశ్వరరావు, జి.నాగేశ్వరరావు, ఎల్.రామారావు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ పారాయణం ఆదివారం ఉదయం 7:30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. సుమారు 2500 నుంచి 3000 మంది భక్తులు పాల్గొని 108 సార్ల చొప్పున 3లక్షల సార్లు పారాయణం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరుకానున్న వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పేర్ల నమోదుకు మహిళలు భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లలో సంప్రదించాలని తెలిపారు. లోక కల్యాణార్థం రాష్ట్రంలోనే మొదటిసారి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పారాయణం వీక్షణకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారు వస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి అనుగ్రహం పొందాలని తెలిపారు.



దీపంలో దైవం

- గోదావరి నదిలో గుట్టపైన వెలిసిన మోతెగడ్డ వీరభద్రుడు
- కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయంగా ప్రసిద్ధి
- స్వామి వారి దర్శనం కోసం పడవల్లో భక్తుల రాక

7

దేశమంటే అంబానీ, అదానీలేనా...

- కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చిన కేంద్ర బడ్జెట్
- కష్టజీవులకు ఒరిగిందేమీ లేదు
- ప్రముఖ ఆర్థికరంగ విశ్లేషకుడు డి.పాపారావు

6



స్వాహాయి..హాయిగా..

- రూ.లక్షల్లో పోయినా పట్టించుకోకపోవడంతో రూ.కోట్లలో పక్కదారి
- డైట్‌లో విద్యార్థుల ఫీజు డబ్బులను కొట్టేసిన జూనియర్ అసిస్టెంట్
- ఆరేళ్ల తర్వాత వడ్డీ వసూలుకు అధికారుల ఉత్తర్వులు
- మరో స్వాహాపర్వంలో రూ.కోటి 99 లక్షలు మింగేసిన ఔట్‌సోర్సింగ్ అకౌంటెంట్
- ఏడాదిగా కొనసాగుతున్న రికవరీ పర్వం
- తాజాగా ఆర్ఆర్ యాక్టు ప్రయోగం
- తెరవెనుక బాధ్యులపై నేటికీ కానరాని చర్యలు

చేతులు కాలాక ఆకులు పట్టుకుంటున్న పాఠశాల విద్యాశాఖ అధికారులు

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా పాఠశాల విద్యాశాఖలో కొందరు ఉద్యోగులు ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్న ఘటనలు ఆ శాఖకు మచ్చ తెస్తున్నాయి. నిధుల స్వాహా సమయంలో జిల్లాస్థాయి అధికారులు ఏమీ పట్టనట్టుగా ఉండి, ఆ తర్వాత చేతులు కాలాక ఆకులు పట్టుకున్న తీరుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిధులు స్వాహా చేసిన వారిలో కొందరి నుంచి వడ్డీతో సహా నేరుగా వసూలు చేస్తుండగా, మరికొందరిపై రికవరీ యాక్టును ప్రయోగిస్తున్నారు. ఖమ్మం నగరంలోని డైట్‌లో విద్యార్థుల ఉపకార వేతనాలను స్వాహా చేసిన ఓ జూనియర్ అసిస్టెంట్ నుంచి అసలును రికవరీ చేసిన అధికారులు, ప్రస్తుతం వడ్డీ వసూలుకు కూడా ఆదేశాలు జారీ చేశారు. మరో సంఘటనలో సమగ్ర శిక్ష అభియాన్ నిధులను స్వాహా చేసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగినుంచి కొంత మొత్తం వసూలు చేసి, మిగతా మొత్తానికి రికవరీ



చట్టాన్ని ప్రయోగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అయితే అవకతవకలకు పాల్పడిన వారిపై వెనువెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తుండటంతో (మిగతా 6వ పేజీలో)



వివరాలు వెల్లడిస్తున్న టెన్నిస్ సంఘం బాధ్యులు

రేపట్నుంచి జాతీయస్థాయి టెన్నిస్ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా టెన్నిస్ అసోసియేషన్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22 నుంచి మార్చి 1వరకు నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో చల్లపల్లి రాధమ్మ మెమోరియల్ ఆల్ ఇండియా ఓపెన్ టెన్నిస్ పోటీలను నిర్వహించనున్నట్టు జిల్లా టెన్నిస్ అసోసియేషన్ బాధ్యులు మద్దినేని వెంకటరమణ, చల్లపల్లి శ్రీనివాస్, డాక్టర్ అనిల్, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్టేడియంలోని టెన్నిస్ అరేనాలో జరిగిన విలేకరుల సమావేశంలో పోటీల వివరాలను వారు తెలిపారు. పోటీల్లో అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది క్వాలిఫైయింగ్ జాతీయస్థాయి మెరిట్ ర్యాంకింగ్ క్రీడాకారులు హాజరవుతారని పేర్కొన్నారు. విజేతలకు రూ.2.5 లక్షల నగదు బహుమతులు ఇవ్వనున్నట్టు వారు తెలిపారు. నగరంలో సుదీర్ఘ కాలం తర్వాత నిర్వహించే ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని క్రీడాభిమానులు ఆదరించాలని కోరారు. సమావేశంలో జిల్లా టెన్నిస్ అసోసియేషన్ ట్రెజరర్ కాంపాటి సత్యనారాయణ, స్టేడియం టెన్నిస్ కోచ్ కైలాష్ తదితరులు ఉన్నారు.

వనం నుంచి జనంలోకి..

- వైభవంగా రెక్కలరామక్క జాతర
- హాజరైన పినపాక, ఇల్లెందు, భద్రాచలం ఎమ్మెల్యేలు
- సడాలమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం

ఆళ్లపల్లి/పినపాక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) భక్తుల కోరికలు తీర్చేందుకు పాండవుల గుట్టనుంచి దేవుళ్లు జనంలోకి వచ్చారు. కొమరం వంశీయుల ఆరాధ్యదైవమైన రెక్కల రామక్క జాతర మూడో రోజు వనదేవతలు వచ్చే కార్యక్రమం అంగరంగ వైభవంగా మొదలైంది. బుధవారం రెక్కలరామక్క దేవున్ని ఏలుపు గుట్ట నుంచి గర్భగుడికి చేర్చగా.. గురువారం పాండవుల గుట్ట నుంచి వనదేవతలను ఆలయ పూజారులు, వడ్డెలు, గిరిజన ఆచార సాంప్రదాయాలతో, కొమ్ము నృత్యాలతో ఎదుర్కోళ్లు నిర్వహించి వనదేవతలను గద్దెలపైకి తీసుకొచ్చారు. వనదేవతలు వస్తున్న శుభవేళ్లలో శివసత్తుల పూనకాలు, డోలీల ధ్వనులతో జాతర ప్రాంగణం మార్మోగింది. శుక్రవారం తెల్లవారుజామున జరిగే వనదేవతల కల్యాణాన్ని తిలకించేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతోపాటు వరంగల్, జైశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, మహబూబాబాద్, జిల్లాల నుంచి గిరిజనులు, భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. ఎదుర్కోళ్ల కార్యక్రమానికి ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరై వనదేవతలను దర్శించుకున్నారు.



పాండవుల గుట్ట నుంచి వస్తున్న దృశ్యం

జాతర ప్రాంగణం మారుమూల ప్రాంతం కావడంతో ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను నేతృత్వంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారులు కనకయ్య, సీతయ్యలాలయ్య, రఘుబాబు, రవి, ఆర్తిబిడ్డ సతీష్, వడ్డె రామయ్య, కొమరం వంశీయులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

వనదేవత రాకతో పులకించిన భక్తులు

పినపాక మండల కేంద్రంలోని అటవీ శివారు ప్రాంతంలో స్వయంభు సడాలమ్మ జాతరకు గురువారం భక్తులు పోటెత్తడంతో ప్రాంగణం జనసంద్రంగా మారింది. వనదేవత గురువారం గద్దెలపైకి చేరుకోవడంతో నిండు జాతర ప్రారంభమైంది. జాతర సందర్భంగా పినపాక గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. భక్తుల కొంగు బంగారంగా, కోరిన కోర్కెలు తీర్చే వనదేవత శ్రీదేవి సడాలమ్మ అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ దృష్టిలో పెట్టుకుని జాతర నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. గిరిజన సాంప్రదాయ కొమ్ము నృత్యాలు, శివసత్తుల విన్యాసాలతో జాతర ప్రాంగణం హోరెత్తింది. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, పాడిపంటలతో భక్తులను, గ్రామాన్ని ప్రజలను చల్లగా కాపాడాలని వేడుకున్నారు.



గద్దెలపైకి సదాలమ్మను తీసుకొస్తున్న వడ్డెరలు



జాతరకు హాజరైన ఎమ్మెల్యేలు





మాట్లాడుతున్న డీఆర్వో పద్మశ్రీ, హాజరైన పీవోలు, ఏపీవోలు, ఎన్నికల సిబ్బంది

పోలింగ్‌లో నిబంధనలు పాటించాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సిబ్బందికి శిక్షణలో డీఆర్వో పద్మశ్రీ

ఖమ్మం కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న చేపట్టే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను నిబంధనలు పాటిస్తూ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏ.పద్మశ్రీ అన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం సెక్టార్ అధికారులు, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, మైక్రో అబ్జర్వర్లు, ఓపీవోలకు పోలింగ్ నిర్వహణపై శిక్షణ కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డీఆర్వో పద్మశ్రీ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని ఎన్నికలు నిర్వహించేందుకు సమాయత్తం కావాలన్నారు. ఎన్నికల విధుల పట్ల ఏవైనా సందేహాలు ఉంటే శిక్షణలో నివృత్తి చేసుకోవాలని అన్నారు. గత అనుభవాలు ఉన్నప్పటికీ హ్యాండ్ బుక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ చదవాలని, నిర్లక్ష్యం వహిస్తే తప్పులు జరుగుతాయన్నారు.

మాస్టర్ ట్రైనర్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి, జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్.మాధవిలు పోలింగ్ నిర్వహణపై, బ్యాలెట్ బాక్స్‌లను ఓపెన్ చేయడం, క్లోజ్ చేయడం, సీల్ చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు ఉదయం 7:30 గంటలకు ఖాళీగా ఉన్న బ్యాలెట్ బాక్స్‌ను ఏజెంట్లకు చూపించి, గ్రీన్ పేపర్‌లో ఏజెంట్ల సంతకాలు తీసుకుని సీల్ చేసి, బ్యాలెట్ బాక్స్‌పై పోలింగ్ కేంద్రం వివరాలు కనపడే విధంగా పేపర్ అతికించాలని సూచించారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు డిస్ట్రిబ్యూషన్ కేంద్రానికి వచ్చి పోలింగ్ డ్యూటీ అలాట్మెంట్ ఆర్డర్‌తోపాటు సంబంధిత పోలింగ్ కేంద్రం సిబ్బందితో కలిసి చెక్ లిస్ట్ ప్రకారం ఒకటికి రెండుసార్లు సరి చూసుకుని పోలింగ్ సామగ్రి తీసుకెళ్లాలని సూచించారు. పోలింగ్ రోజు ప్రతి రెండు గంటలకు, పోలింగ్ ముగిసిన తరువాత పోలింగ్ జరిగిన వివరాల రిపోర్ట్ పంపాలని అన్నారు. బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్స్‌ల ప్రిపరేషన్, స్టాట్యూటరీ, అన్ స్టాట్యూటరీ సామగ్రి, ఎన్నికల సంబంధ నివేదికల పూరింపు, డైరీల నమోదులపై అధికారులకు అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్స్ సీలింగ్‌పై హ్యాండ్ ఆన్ శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు స్వామి, కలెక్టరేట్ ఎన్నికల డీటీ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.

‘గూడెం’ రైల్వేస్టేషన్ మరమ్మతులు పూర్తి చేయాలి

- సెంట్రల్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి
- సౌత్ సెంట్రల్ రైల్వే ఏడీఆర్ఎం గోపాలకృష్ణయ్యకు వినతి



ఏడీఆర్ఎం గోపాలకృష్ణయ్యకు వినతిపత్రం అందిస్తున్న సెంట్రల్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం రైల్వే స్టేషన్‌లో చేపట్టిన మరమ్మతు పనులు తక్షణమే పూర్తి చేయాలని సౌత్ సెంట్రల్ రైల్వే కమిటీ సభ్యుడు వైశ్రీనివాసరెడ్డి కోరారు. గురువారం కొత్తగూడెం రైల్వే స్టేషన్ (భద్రాచలం రోడ్)కు విచ్చేసిన అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్ఎం) గోపాలకృష్ణయ్యకు వినతిపత్రం అందించి మాట్లాడారు. బెల్గావి ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ ప్యాసింజర్ రైళ్లను తిరిగి పునరుద్ధరించాలని, కాకతీయ ఎక్స్‌ప్రెస్‌లో రిజర్వేషన్ బోగీలను ఏర్పాటు చేయాలని కోరారు. పుణ్య క్షేత్రాలైన తిరుపతి, షిర్డీ, భద్రాచలానికి ప్రత్యేక రైళ్లు నడపాలని, నత్తనడక నడుస్తున్న కొత్తగూడెం రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు తక్షణం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత అభివృద్ధికి ప్రజల సౌకర్యం కోసం కొవ్వూరు రైల్వేలైన్‌తో పాటు కొత్తగూడెం కేంద్రంగా రైల్వే జంక్షన్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఏడీఆర్ఎం రుద్రంపూర్ ఆర్‌సీహెచ్‌పీ, పాల్వంచ కేటీపీఎస్, మణుగూరు, సత్తుపల్లి బొగ్గుగనుల ప్రాంతాలను సందర్శించేందుకు రోడ్డు మార్గంలో వెళ్లారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ సౌత్ సెంట్రల్ రైల్వే డివిజన్ అధికారులు, కొత్తగూడెం రైల్వేస్టేషన్ ఏరియా ఆఫీసర్ మీనా, ఏరియా ఇన్‌స్పెక్టర్ పాషా, రైల్వే పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐకమత్యంతో పరిశ్రమలు నడిపిస్తేనే లాభాలు

సీఐటీడీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్

భద్రాచలం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని జీవనోపాధి పొందుతున్న యూనిట్ సభ్యులు ఐకమత్యంతో ఉంటేనే లాభాలు వస్తాయని సీఐటీడీ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. గురువారం వైటీసీలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్స్ డిజైన్ (సీఐటీడీ) సంస్థ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ యూనిట్ సభ్యులకు మూడు రోజుల శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు సక్రమంగా నడవాలంటే యూనిట్ సభ్యులందరూ బాధ్యతగా తమకు సంబంధించిన పనులు సక్రమంగా నిర్వహిస్తే ప్రతి పరిశ్రమ లాభాల బాటలో నడుస్తుందన్నారు. సభ్యులు తయారు చేసే వస్తువులు మార్కెటింగ్ సౌకర్యం కల్పించుకోవడానికి అందరితో పరిచయాలు పెంచు కోవాలని ముడి సరుకులు కొనుగోలు చేసిన దగ్గర నుంచి తయారు చేసిన ప్రతి వస్తువును తప్పనిసరిగా రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. అలాగే పరిశ్రమలు పెట్టుకున్న యూనిట్ సభ్యులంద రూ ఒక దగ్గర ఉండకుండా శాఖల వారీ గా పని విభజన చేసుకొని చర్చించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, సీఐటీడీ శిక్షకుడు విజయ్‌కుమార్, భవిత సెల్ సిబ్బంది మణికుమారి, సమ్మయ్య, దినేష్ పాల్గొన్నారు.

ఇటుకల తయారీ పరిశ్రమ యూనిట్ సభ్యులకు చెక్కు అందజేత

ఆళ్లపల్లి మండలం శ్రీ ధనలక్ష్మి ఫ్లయాష్ బ్రిక్స్ యూనిట్ సభ్యులకు సబ్సిడీ కింద మంజూరైన చెక్కును ఐటీడీఏ బి.రాహుల్ అందజేశారు. రూ.25 లక్షలు యూనిట్ కాస్టు కాగా ఇందులో రూ.15 లక్షలు సబ్సిడీ లభించింది. అలాగే 2.5 లక్షలు బెనిఫిషర్ కంట్రిబ్యూషన్‌తో యూనిట్ ఏర్పాటు చేసుకున్నామని, రూ.7.5 లక్షలు బ్యాంకు రుణం లభించిందని యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు, జేడీఎం హరికృష్ణ, గ్రూపు సభ్యులు సుశీల, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయ్‌కుమార్

స్వాహాయి..హాయిగా..

(5వ పేజీ తరువాయి)

అక్రమార్కులు ఆడిందే ఆటగా సాగుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర అధికారుల ప్రమేయంతో వెలుగులోకి...

ఖమ్మం నగరంలోని డైట్ కళాశాలలో విద్యార్థుల నుంచి వసూలు చేసిన ఫీజులను ఓ కిందిస్థాయి ఉద్యోగి చేతివాటం ప్రదర్శించి పక్కదారి పట్టించాడు. 2018లో జూనియర్ అసిస్టెంట్ ఎ.రమేష్ (ప్రస్తుతం ఖమ్మం రిక్కాబజార్‌లో రెగ్యులర్‌గా ఉంటూ వరంగల్ ఆర్జేడీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు) కళాశాలలో ఫీజుల రూపేణ విద్యార్థుల నుంచి వసూలు చేసిన డబ్బుల్లో రూ.2లక్షల 13వేలను తన సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయం విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల వద్దకు చేరడంతో సంబంధిత నగదును రికవరీ చేయాలని ఆదేశించారు. అనంతరం రెండు ఇంక్రిమెంట్లను నిలిపివేశారు. ఈ సంఘటన జరిగిన సంవత్సర కాలానికి జూనియర్ అసిస్టెంట్ రమేష్ నుంచి అసలు మొత్తం వసూలు చేశారు.

అయితే ఇక్కడితో చేతులు దులుపుకోవడంతో కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ఆరేళ్లపాటు డబ్బులను వాడుకున్నందున అతడి నుంచి వడ్డీ కూడా వసూలు చేయాలని ఫిర్యాదుదారులు పేర్కొన్నారు. దీంతో జూనియర్ అసిస్టెంట్ నుంచి రూ.1.28 లక్షల వడ్డీ వసూలు చేయాలని డీఈవో సోమశేఖరశర్మ గత నెల 30న ఆదేశాలు జారీచేశారు. డీఈవో జారీచేసిన ఆదేశాలు రిక్కాబజార్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలికి అందాయి. జూనియర్ అసిస్టెంట్ జీతం నుంచి నెలకు రూ. 5850 చొప్పున 24 నెలల పాటు కట్‌చేసి డైట్ కళాశాల ఎకౌంట్‌లో జమ చేయాలని పేర్కొన్నారు. మార్చి 1 నుంచి వడ్డీ మొత్తాన్ని మినహాయించనున్నారు.

అయితే ఆరేళ్ల కాలం నుంచి అధికారులు నగదు వసూలు పట్ల ఎందుకు చర్యలకు పూనుకోలేదన్నది కొసమెరుపు. ఇదిలావుండగా, ప్రస్తుతం జిల్లా విద్యాశాఖలో ఉన్నతాధికారిగా పనిచేస్తున్న వ్యక్తి... గతంలో ఇదే కళాశాలలో పనిచేశారు. ఈ వ్యవహారంలో సదరు వ్యక్తి ప్రమేయం కూడా ఉందని చర్చ జరుగుతోంది. ఇంత జరిగినప్పటికీ జూనియర్ అసిస్టెంట్‌పై ఎలాంటి కేసు నమోదు చేయించకపోవడం గమనార్హం.

ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగం...

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సమగ్ర శిక్షా అభియాన్ ద్వారా కోట్లాది రూపాయలు కేటాయిస్తారు. గత ఏడాది రూ.కోటి 99 లక్షల నిధులను డీఈవో కార్యాలయ ఔట్‌సోర్సింగ్ అకౌంటెంట్ ఫోర్జరీ సంతకాలతో వ్యక్తిగత అకౌంట్‌కు బదిలీ చేయించుకున్నాడు. కారేపల్లి మోడల్ స్కూల్, ఇల్లెందు మైనారిటీ పాఠశాల, ఇంకా పలు పాఠశాలలకు సంబంధించిన ఈ నిధులను పక్కా ప్లాన్‌తో సొంత అకౌంట్‌లోకి మళ్లించుకున్నాడు. డీఈవో సంతకాన్నే ఫోర్జరీ చేసినా.. ఎవరూ గుర్తించలేకపోయారు. దీనివెనుక కార్యాలయ అధికారుల హస్తం ఉందనే ఆరోపణలు కూడా వచ్చాయి. ఈ సంఘటన జిల్లా విద్యాశాఖను కుదేపేసింది.

గత ఏడాది జూలై 10న సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు, సీనియర్ కన్సల్టెన్సీ అధికారి జి.విజయ్‌శంకర్, జూనియర్ అకౌంట్స్ అధికారి బాలజయశంకర్ జరిపిన తనిఖీల్లో నిధుల స్వాహాపర్వం వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటనకు సంబంధించి నిధులు మళ్లించిన వ్యక్తితో పాటు అతని భార్యను సైతం నిందితురాలిగా చేర్చి కేసు నమోదు చేశారు. అయితే యేడాది కాలం పాటు కేసు నమోదు చేసి చేతులు దులుపుకున్న అధికారులు.. పక్కదారి పట్టిన నిధులను రికవరీ చేయడంలో నిర్లక్ష్యం చేశారన్న విమర్శలున్నాయి.

ఈ కేసుకు సంబంధించి ఇప్పటి వరకు రూ.కోటి 10 లక్షలు వసూలు చేయగా.. నిధులు పక్కదారి పట్టించిన ఔట్‌సోర్సింగ్ అకౌంటెంట్ గత నెల చనిపోవడంతో మళ్లీ మొదటికి వచ్చింది. ప్రస్తుతం మిగిలిన రూ.89 లక్షలు నిధులను నిందితురాలిగా ఉన్న అతని భార్య నుంచి వసూలు చేసేందుకు ఆర్ఆర్ యాక్ట్ ప్రయోగించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. నిధుల స్వాహాకు సంబంధిత సెక్షన్ అధికారుల బాధ్యత వున్నా, వారిపైన ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

గురువుల పోరు.. ప్రచార హోరు...

(5వ పేజీ తరువాయి)

మండల, గ్రామ, పట్టణాల్లో వార్డుల వారీగా ఉపాధ్యాయులను స్వయంగా కలుస్తూ అభ్యర్థిస్తున్నారు.

హోరాహోరీ పోరు..

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల, పరిధి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బరిలో 19మంది అభ్యర్థులు తలపడుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి టీఎస్‌యూటీఎఫ్ అభ్యర్థిగా రెండో పర్యాయం పోటీలో ఉండగా.. ఆయనకు టీపీటీఎఫ్ సంఘం మద్దతునిస్తోంది. కాగా పీఆర్‌టీయూ సంఘానికి గతంలో నాయకత్వం వహించిన వారిలో తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు నాయకులు పోటీలో ఉండటం గమనార్హం.పీఆర్‌టీయూ-టీఎస్ అభ్యర్థిగా పింగిళి శ్రీపాల్‌రెడ్డి ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సమితి (జాక్టో) అభ్యర్థి మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, బీజేపీ అభ్యర్థిగా సరోత్తంరెడ్డి, పీఆర్‌టీయూ తెలంగాణ అభ్యర్థిగా హర్షవర్ధన్‌రెడ్డి, సీపీఎస్ అభ్యర్థి కొలిపాక వెంకటస్వామి తదితరులు పోటీలో ఉన్నారు. అయితే ఉపాధ్యాయ సంఘాలకు తోడు తాజా ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా గతంలో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడిగా పనిచేసిన వరంగల్ జిల్లాకు చెందిన సరోత్తంరెడ్డి పోటీలో ఉండటంతో ఆయనకు మద్దతుగా బీజేపీకి చెందిన కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు.

కాగా గతంలో పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడిగానే పనిచేసిన మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ సైతం జాక్టో మరికొన్ని ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘాల మద్దతుతో ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా ప్రభుత్వ, ఎయిడెడ్, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, వివిధ యూనివర్సిటీల అధ్యాపకులతోపాటు గురుకులాలు, ఐటీడీఏ, మైనారిటీ, బీసీ, ఎస్సీ, సింగరేణి తదితర విద్యాసంస్థల ఉపాధ్యాయులన్నారు. ఫలితంగా అభ్యర్థులు, మద్దతుదారులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న యూటీఎఫ్ అభ్యర్థి నర్సిరెడ్డి

25,797 మంది ఓటర్లు..

శాసన మండలి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల్లో 12 జిల్లాల పరిధిలో 25,797మంది ఓటర్లుగా ఉన్నారు. అత్యధిక ఓటర్లు హన్మకొండ జిల్లాలో ఉండగా.. అత్యల్పంగా సిద్దిపేట జిల్లాలో ఉన్నారు. శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు నమోదు చేసుకున్న వారికే ఎన్నికల కమిషన్ ఓటు హక్కు కల్పిస్తుంది. ఫలితంగా గతంతో పోలిస్తే తాజా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల సంఖ్య తగ్గినట్టు పలువురు నాయకులు పేర్కొన్నారు. జిల్లాల వారీగా ఉపాధ్యాయ ఓటర్ల సంఖ్య ఈ విధంగా ఉంది.



ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్‌టీయూ అభ్యర్థి శ్రీపాల్ రెడ్డి



ఉపాధ్యాయ ఎన్నికల్లో బీజేపీ నేతల ప్రచారం

దేశమంటే అంబానీ, అదానీలేనా..

- కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చిన కేంద్ర బడ్జెట్
- ప్రముఖ ఆర్థికరంగ విశ్లేషకుడు డి.పాపారావు

కొత్తగూడెం, ఫిబ్రవరి 20, (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దృష్టిలో దేశమంటే అంబానీ, అదానీలే తప్ప సామాన్య ప్రజలు కాదని... ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు ఊతమిచ్చే బడ్జెట్ తప్ప .. కష్టజీవులకు ఒరిగిందేమి లేదని ప్రముఖ ఆర్థికరంగ విశ్లేషకుడు డి.పాపారావు అన్నారు. గురువారం కొత్తగూడెంలోని సీపీఎం మంచికంటి భవనంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలాసీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశ పెడుతూ దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్ అన్న కవి గురజాడ సూక్తిని ఉటంకిస్తూ మాట్లాడారని, కానీ సమాజ సంపదలో సృష్టికర్తలుగా ఉన్న కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతాంగానికి ఊరట ఇచ్చే విధంగా కాని, కొత్త పథకాల ప్రకటన కాని, కొనుగోలు శక్తి పెంచే నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో లేవన్నారు. పైగా అనేక రూపాల్లో పరోక్ష పన్నులు భారీగా విధించారన్నారని తెలిపారు.

భారత దేశంలో నూతన ఆర్థిక విధానాల అమలు ప్రారంభమైన 1991 సంవత్సరం నుంచి వచ్చిన వరుస బడ్జెట్‌ను పరిశీలిస్తే కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తూ సామాన్యులు, మధ్య తరగతి వర్గాలపైన భారాన్ని తీసుకొచ్చే బడ్జెట్‌ను తీసుకొచ్చారని విమర్శించారు. రాను రాను క్రమక్రమంగా సామాజిక తరగతులకు బడ్జెట్ కేటాయింపులు తగ్గిస్తూ వస్తున్నారని, ప్రభుత్వ రంగ ఆస్థులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ఆరోపించారు.

ప్రభుత్వ ఆస్థులను, సహజ వనరులను డీమానుటైజేషన్ పథకం ద్వారా వందల సంవత్సరాలు కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేసే నిర్ణయాలు ఈ బడ్జెట్‌లో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చే సంపదను నగరాలకు తరలిస్తున్నారని, పట్టణాల్లో ప్రజలకిచ్చే మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని అభివృద్ధి చేయాలనే నిర్ణయం ఈ బడ్జెట్‌లో ఉందన్నారు.

రైతాంగం పండించిన పంటలకు మద్దతు ధర ఇవ్వాలని అనేక ఆందోళన జరుగుతున్నా ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. పైగా మూడు నల్ల వ్యవసాయ చట్టాలను దొడ్డిదారిన అమలు చేయడానికి బడ్జెట్ మార్గం వేసిందన్నారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను ఏప్రిల్ నుంచి అమలుకు పూనుకున్నారని తెలిపారు. కార్మిక వర్గం తమ కనీస వేతనం రూ26 వేలు ఇవ్వాలని, సామాజిక భద్రతా చట్టాలను అమలు చేయాలని పెద్దఎత్తున సమ్మెలు చేస్తుంటే పరిగణలోకి తీసుకోలేదని తెలిపారు.

ఈ సదస్సులో సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏజే రమేష్, అన్నవరపు సత్యనారయణ, రేపాకుల శ్రీనివాస్, మచ్చా వెంకటేశ్వర్లు, అన్నవరపు కనకయ్య, ఎలమంచలి వంశీకృష్ణ, కొక్కరపాటు పుల్లయ్య, కన్సోత్ ధర్మా, దొడ్డ రవికుమార్, కే.సత్య, ముదిగొండ రాంబాబు, ఊకంటి రవి, ఎస్ఏ నబి, ఆలేటి కిరణ్, శెట్టి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చెమట చుక్కల్లోనూ కాసుల వేట

(5వ పేజీ తరువాయి)

మండల వ్యవసాయాధికారి కార్యాలయానికి వెళ్లాడు. ఏవో సూచన మేరకు రూ.30వేల నగదును అక్కడున్న ల్యాప్‌ట్యాప్ బ్యాగులో ఉంచి బయటకు వచ్చాడు. అదే సమయంలో అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు కార్యాలయంలోకి వెళ్లి బ్యాగులో ఉన్న డబ్బులను స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం ఏవోను అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని, ఫిర్యాదుదారుడి పేరును వెల్లడించలేమని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు అడిగితే టోల్‌ఫ్రీ 1064కు ఫోన్ చేయాలన్నారు. ఈ దాడిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు సట్ల రాజు, శేఖర్ పాల్గొన్నారు.

విచారణాధికారే పట్టుబడ్డాడు..

అశ్వాపురం మండలంలో ఇటీవల చోటుచేసుకున్న నకిలీ టీఆర్‌ల కుంభకోణానికి సంబంధించి ఓ ఏఈవోపై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంపై క్షేత్రస్థాయి విచారణాధికారిగా వ్యవహరించిన ఏవో సాయిశంతన్‌కుమార్.. ఇప్పుడు ఏసీబీకి పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. అక్రమాలను నిగ్గుతేల్చాల్సిన అధికారే రూ.30వేల లంచం తీసుకొని అవినీతి కేసులో ఇరుక్కోవడం విస్మయంకలిగిస్తోంది.

టీఆర్‌ల వ్యవహారం...

రైతులు పండించిన పత్తి పంటను సీసీఐలో విక్రయించుకునేందుకు మార్కెట్ కమిటీల ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖాధికారులు టీఆర్‌లు జారీ చేస్తారు. ఈ క్రమంలో ఇటీవల టీఆర్‌లలో వ్యత్యాసాలపై సీసీఐ ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసింది. దీంతో రాష్ట్ర ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ మణుగూరు అడిషనల్ డైరెక్టర్(ఏడీఏ) తాతారావు, అశ్వాపురం మండల ఏవో సాయి శంతన్‌కుమార్‌లు విచారణ నిర్వహించగా దీంతో విచారణలో భద్రాచలం మార్కెట్ కమిటీ పరిధిలో అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో నకిలీ టీఆర్‌లు వెలుగులోకి రావడంతో ఈ విషయాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపారు. దీంతో ఇప్పటికే భద్రాచలం మార్కెట్ కమిటీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు పడింది. అదేవిధంగా అశ్వాపురం మండలంలో పని చేస్తున్న ఓ ఏఈవో నకిలీ టీఆర్‌ల కుంభకోణంలో సూత్రధారిగా ఉన్నతాధికారుల కు నివేదిక అందినట్లు సమాచారం. ఇదిలావుండ గా, ఏవోపై ఏసీబీ అధికారుల దాడిలో కుట్రకోణం ఉందంటూ సోషల్ మీడియాలో పోస్టింగ్ లు కనిపించాయి. పదిహేనురోజుల వ్యవధిలో వ్యవసాయశాఖకు సంబందించిన ఇద్దరు అధికారులపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తటం గమనార్హం.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు చేయాలి

» కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ విపాటిల్

కొత్తగూడెం, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేయాలని కలెక్టర్ జితేష్ విపాటిల్ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయం లో ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీస్, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్, శాఖల అధికారులతో ఇంటరీడ్మియట్ పరీక్షల నిర్వహణపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రశాంత వాతావరణంలో పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 5మార్చి నుంచి మార్చి25 వరకు ఉదయం 9గంటల నుంచి 12గంటల వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు మొత్తం 36 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. మొదటి సంవత్సరంలో 9,255మంది, రెండవ సంవత్సరంలో 10,003 మంది విద్యార్థులు హజరుకానున్నారని తెలిపారు. పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలన్నారు. పరీక్షలకు హజరయ్యే విద్యార్థులు ఉద యం 8.30గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరేందుకు అవసరమైన రూట్‌లలో బస్సు సర్వీసులు నడిచేలా చూడాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా తగు చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, పరీక్షల నిర్వహణకు భద్రత ఏర్పాట్లు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించా రు. ఈ కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర చారి, డీఐఈవో వెంకటేశ్వరరావు, డీఎంఅండ్‌హెచ్‌వో భాస్కర్ నాయక్, ఎఆర్‌డిఎస్ పి.సత్యనారాయణ, టేకులపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సులోచన, రాణి, కొత్తగూడెం, ఇల్లెందు, పాల్వంచ శేషంజన్ స్వామి, శ్రీకాంత్, సుజాత తదితరులు పాల్గొన్నారు.

స్థలం ఇప్పించాలంటూ వృద్ధురాలి నిరసన




నిరసన తెలుపుతున్న వృద్ధురాలు

మధిరటౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): తన స్థలం తనకు ఇప్పించాలంటూ ఓ వృద్ధురాలు ఆందోళనకు దిగిన సంఘటన మధిరలో చోటు చేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం..దెందుకూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు కనుకుపుడి కరుణమ్మ గురువారం మధిర తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసనకు దిగింది. తన భర్తకు ప్రభుత్వం 50 ఏళ్ల క్రితం ఇంటి స్థలం ఇచ్చిందని తెలిపింది. తన భర్త మరణించే వరకు తాను చాలా కాలం అదే స్థలంలోనే నివసించాని పేర్కొంది. భర్త మరణంతో 85 సంవత్సరాల వృద్ధాప్యంతో నాలుగేళ్లుగా గ్రామంలోనే ఎస్సీ కాలనీలో ఉంటున్న తన కుమారుడి చెంత ఉంటున్నానని తెలిపింది. దీంతో తాను గతంలో నివసించిన ఇల్లు శిథిలమైందని అన్నారు. గత మూడు నెలల క్రితం గ్రామానికి సంబంధంలేని వ్యక్తి వచ్చి తన స్థలంలో రేకులు వేసి స్థలం నాదే అంటూ కొంత మంది గ్రామస్తుల అండతో దౌర్జన్యానికి దిగాడని వాపోయింది. దీనితో తాను అడ్డగించడమే కాకుండా పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. తహసీల్దార్‌కు కూడా తన స్థలం తనకు ఇప్పించాలని దరఖాస్తు ఇచ్చానని తెలిపారు. రెవెన్యూ అధికారులు విచారణకు వచ్చిన సమయంలో చుట్టు పక్కల వారు స్థలం తనదేనని తెలిపినా, అప్పగించడంలో కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. తన స్థలం తనకు ఇప్పించే వరకు ఇక్కడ నుంచి కదలనని దీక్షకు కూర్చున్నారు. దీనితో తహసీల్దార్ రాంబాబు వృద్ధురాలి దగ్గరికి వచ్చి స్థలంలో రేకులు వేసిన వ్యక్తికి నోటీసు ఇచ్చి, తన దగ్గర ఉన్న ఆధారాలతో శనివారం లోపు తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొనడం జరిగిందని, ఎటువంటి ఆధారాలు చూపకపోతే విచారణ ప్రకారం స్థలం అప్పగిస్తానని హామీ ఇవ్వడంతో వృద్ధురాలు దీక్ష విరమించింది. వృద్ధురాలికి సీపీఎం నాయకులు మందా సైదులు, తేలప్రోలు రాధాకృష్ణ సంఘీభావం తెలిపారు.

ద్వీపంలో దైవం

- గోదావరి నది మధ్యలో వెలసిన మోతెగడ్డ వీరభద్రుడు
- కాకతీయుల కాలంలో నిర్మించిన ఆలయంగా ప్రసిద్ధి
- దర్శనానికి తరలిరానున్న నాలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు



ఆలయం వద్ద స్నానాలు ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

బూర్గంపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చుట్టూ గోదావరి నది ప్రవాహం మధ్యలో ఓ గుట్టపై వేంచేసిన వీరభద్రస్వామి ఆలయం ఎంతో ప్రాచీన పురాతన ఆలయంగా ప్రసిద్ధి. తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా గోదావరి నది మధ్యలో ఉన్న ఏకైక ద్వీపకల్ప ఆలయంగా ప్రసిద్ధికెక్కింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మోతె గ్రామానికి కొద్ది దూరానికి గోదావరి నది మధ్యలో ఈ ఆలయం ఉంది. గోదావరి సమీపం నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో గుట్టపై ఈ ఆలయానికి చేరుకోవాలంటే నాటు పడవల ద్వారా చేరుకోవాల్సిందే. మోతెగడ్డ వీరభద్రుడు గిరిజనులకు అతిప్రీతుడుగా కొలవడంతో ప్రతి శివరాత్రి పర్వదినాన జరిగే కల్యాణ మహోత్సవాన్ని వీక్షించేందుకు అధికంగా గిరిజనులు వస్తుంటారు. ఈ కల్యాణానికి రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి అధికంగా గిరిజనులు కల్యాణానికి తరలి వస్తుంటారు. గోదావరి నీటి ప్రవాహం ప్రమాదస్థాయికి మించి ప్రవహించినా ఆ ఆలయం పురాతన కాలం నుంచి ఇప్పటికీ ముంపునకు గురికాలేదని పూర్వీకులు చెబుతుంటారు. ఇక్కడ వేంచేసిన వీరభద్రస్వామి కల్యాణంతో పాటు గిరిజనుల సంప్రదాయ పద్ధతుల్లో నేటికి పూజలు కొనసాగుతున్నాయి. గోదావరి మధ్యలో ఉన్న ఈ గుట్టకు మోతెగడ్డగా పేరుండటంతో మోతెగడ్డ వీరభద్రస్వామిగా భక్తులు కొలుస్తుంటారు.

నాటు పడవల ద్వారా భక్తుల రాక ...

భక్తులు నాటుపడవలతో గోదావరి నదిని దాటి నది మధ్యలో ఉన్న ఆలయాన్ని దర్శించుకోవడం జరుగుతుంది. వరదలు, వర్షాల సమయంలో గోదావరి నది ప్రవాహం అధికంగా ఉండటంతో భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలంటే నాటుపడవల ద్వారానే రావాల్సి ఉంటుంది. అదే విధంగా శివరాత్రి సమయంలో స్వామి వారికి నిర్వహించే కల్యాణంను తిలకించేందుకు రావాలన్నా ఇదే పరిస్థితి.

అనంతరం ఈ ఆలయంలో స్వామి వారిని దర్శించేందుకు భక్తులకు అనువైన పరిస్థితులను కల్పించడంలో పాలకులు వైఫల్యం చెందారనే విమర్శలున్నాయి. ప్రభుత్వాలు మారుతున్న ఆలయ అభివృద్ధి మా త్రం అలానే ఉండిపోయిందని భక్తులు పెర్కొంటున్నారు.

వీరభద్రుని చెంత సూర్య భగవానుడు

సాధారణంగా శివాలయంలో ఎక్కడైనా కూడా ఆలయం ముందు నందీశ్వరుడు కొలువుదీరి ఉంటాడు. ఆలయాన్ని భక్తులు దర్శించుకున్న సమయంలో స్వామి వారితో పాటు నందీశ్వరుడిని దర్శించుకోవడం జరుగుతుంది. కాని ఇక్కడ విచిత్రం ఏమిటంటే వీరభద్రస్వామి ఆలయానికి తూర్పు భాగంలో నంది విగ్రహంతో పాటు సూర్యదేవుని ఆలయం ఉండటం విశేషం. ఈ ఆలయానికి సూర్యభగవానుడే క్షేత్ర పాలకుడిగా ఉండడంతో వీరభద్రుని సూర్యభగవానుడిని ఒకే చోట దర్శించుకునే భాగ్యం భక్తులకు కలుగుతుంది. గత ఏడాదిలో వచ్చిన గోదావరి వరదలకు వరద ఉధృతి ప్ర మాదకర స్థాయిలో ప్రవహించడంతో ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన ప్రహరీ కొంతమేర దెబ్బతింది. కాగా ఈ ఆలయం గోదావరి మధ్యలో ఉండటంతో విద్యుత్తు సౌకర్యం లేదు.

అభివృద్ధిచేస్తే పర్యాటకంగా మరింత ప్రసిద్ధి

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ప్రాచుర్యం పొంది గోదావరి నది మధ్యన ఉన్న మోతెగడ్డ వీరభద్రస్వామి వారి ఆలయంను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తే పర్యాటకంగా మరింత ప్రసిద్ధి చెందే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఆలయాన్ని చేరుకునేందుకు రోప్‌వే ఏర్పాటు, దేవాలయంలో సోలార్ విద్యుత్తు సౌకర్యం, భక్తుల రాకపోకలకు అనుగుణంగా గోదావరి చెంత మరబోట్లను ఏర్పాటు చేస్తే ఎంతో ప్రాచుర్యం కలిగిన ఈ దేవాలయం భక్తులతో పాటు పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యం ఇస్తున్న నేపద్యంలో తెలంగాణ రాష్ట్రంలోనే ఎంతో ప్రాచుర్యం కలిగిన మోతెగడ్డ వీరభద్ర స్వామి ఆలయ అభివృద్ధికి తగిన విధంగా నిధులు కేటాయించాలని స్థానికులు కోరుతున్నారు.



మోతెగడ్డ వీరభద్రస్వామి ఆలయం

రావిగూడేనికి పోటెత్తనున్న భక్తులు

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆంధ్రాలోని పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం పెద రావిగూడెం గ్రామంలో గోదావరి ఒడ్డున ఉన్న శ్రీ పార్వతి సమేత కేదారేశ్వర స్వామివార్ల ద్వాదశ జ్యోతిర్లంగ క్షేత్రానికి భక్తులు వేల సంఖ్యలో తరలి వెళ్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని బూర్గంపాడు, పాల్వంచ, భద్రాచలం, అశ్వాపురం, కొత్తగూడెం, ములకలపల్లి, మణుగూరు మండలాల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన భక్తులు ట్రాక్టర్లు, ఆటోలు, కార్లు, దిచక్రవాహనాలపై వెళ్లి స్వామి వారిని దర్శించుకుంటారు. మ హాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



పడవలపై ఆలయానికి చేరుకుంటున్న భక్తులు(ఫైల్)

'ప్రతి విద్యార్థి అపార్ ఐడీ పూర్తి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్

అశ్వారావుపేట/ రూరల్ ,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో ప్రతి విద్యార్థి అపార్ ఐడీ నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని అపార్ ప్లానింగ్ కో ఆర్డీనేటర్ సతీశ్ సూచించారు. అపార్ నమోదుకు సంబందించి జిల్లా అధికారుల బృందం గురువారం మండలంలోని తిరుమలకుంట కాలనీ, మామిళ్లవారిగూడెం పాఠశాలలను సందర్శించారు. ఆయా పాఠశాలల్లో అపార్ నమోదుకు సంబందించిన వివరాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలు, ఆశ్రమాల బాధ్యులు, సీఆర్‌పీలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. అపార్‌లో వెనుకబడి ఉన్నామని, ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. పలుఅంశాలపై సూచనలు చేశారు. సమావేశంలో ఎంఈవో ప్రసాదరావు, ఏఎంవో నాగరాజశేఖర్, పీఎంవో సైదులు పాల్గొన్నారు.

యూపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి

» టీఎస్‌సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్

దమ్మపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఏప్రిల్ 1 నుంచి తీసుకువస్తున్న యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్) విధానాన్ని వెంటనే రద్దు చేయాలని టీఎస్‌సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గురువారం యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ నిర్వహించే యుద్ధభేరి పోస్టర్‌ను దమ్మపేటలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2004 తర్వాత నియమితులైన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఎఫ్‌ఆర్‌డీఏ చట్టం అమలులోకి తెచ్చి సీపీఎస్ విధానంతో ఉద్యోగుల వృద్ధాప్యాన్ని చీకటిలో పాడేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో మరో కొత్త విధానం తీసుకొని రావడాన్ని టీఎస్‌సీపీఎస్‌ఈయూ పూర్తిగా వ్యతిరేకిస్తుందన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ మార్చి 2వ తేదీన హైదరాబాదులో ధర్నా చౌక్‌వద్ద ధర్నా జరుగుతుందని, దీనిని అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘ జిల్లా ప్రదాన కార్యదర్శి రాజశేఖర్ తదితరులున్నారు.

కుటుంబ కలహాలతో కత్తితో దాడి

కొత్తగూడెం త్రీటౌన్‌లో కేసు నమోదు

కొత్తగూడెంపోస్టాఫీస్‌సెంటర్,ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఒక వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేసి గొంతును కోశాడు. ఈ సంఘటన కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్ వివరాల ప్రకారం.. కొత్తగూడెం సింగరేణి ఏరియా ప్రాంతంలో కాంట్రాక్ట్ కార్మికుడుగా పని చేస్తున్న ఖదీర్‌పై కార్పెంటర్‌గా పని చేస్తున్న బంధువైన ముస్తఫా కత్తితో దాడి చేశాడు. వివాహ అనంతరం తరచు తన సోదరితో గొడవలు పడుతున్న నేపథ్యంలో సహించలేక కత్తితో దాడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో అతడి గొంతుపై గాయమవడంతో కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య ఆసియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడులు

అశ్వారావుపేటరూరల్,ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): పేకాటశిబిరంపై గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ యయాతిరాజు తెలిపిన వివరాల ప్రకారం.. అశ్వారావుపేటలోని గోగులబందంలో పేకాట ఆడుతుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. రూ.52వేలు, రెండు సెల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. మరోఇద్దరు పరారు అయ్యారు.

భార్యను కొట్టి చంపిన భర్త

» మృతురాలు మధ్యప్రదేశ్‌కు చెందిన వలసకూలీ



మరావి మృతదేహం

కారేపల్లి,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జైత్రాంతండాలో గురువారం భార్య భర్తల మధ్య జరిగిన ఘర్షణలో భర్త భార్యను బలంగా కొట్టడంతో మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన వలసకూలీలు జైత్రాంతండాకు వచ్చారు. అయితే గురువారం ఉదయం వంట చేసే సమయంలో భర్త కమలేష్, అతడి భార్య మరావి(30) మధ్య ఘర్షణ జరిగింది. ఈఘర్షణలో కమలేష్ భార్య మరావిని కడుపులో బలంగా కొట్టాడు. బలమైనగాయం కారణంతోమరావి అక్కడిక్కడే మృతి చెందింది. ఆ విషయం అక్కడే వారు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్‌ఐ ఎన్. రాజారం తన సిబ్బందితో వెళ్లి పరిశీలన చేశారు. నిందితుడు కమలేష్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారాం తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

దమ్మపేట, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): జగ్గారం గ్రామానికి చెందిన మడివి నాగేంద్ర బాబు(28) వరంగల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ గురువారం సాయింత్రం మృతి చెందాడు. గండుగులపల్లి గ్రామ సమీపంలో బుధవారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురు గాయపడిన సంఘటన తెలిసిందే.. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగేంద్రబాబును సత్తుపల్లిలో ప్రథమ చికిత్స నిర్వహించారు. మెరుగైన చికిత్స కోసం వరంగల్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో గురువారం సాయింత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది.

బూర్గంపాడు: మనస్తాపంతో పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు గురువారం మృతి చెందాడు. ఈ సంఘటనకు సంభందించి పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన సోందె పోస(20) తల్లితండ్రులు గతంలో చనిపోవడంతో బూర్గంపాడు మండల పరిధిలోని చెరువుసింగారంలో గల బంధువుల వద్ద ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో ఈనెల 7న ఇంట్లో పురుగుల మందు తాగడంతో బంధువులు భద్రాచలం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్‌ఐ నాగభిక్షం కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



టేకులపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు-కొత్తగూడెం ప్రధాన రహదారిపై మండల కేంద్రంలోని లారీఆఫీసు సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. టేకులపల్లి పోలీసుల కథనం ప్రకారం.. సులానగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచి అజ్మీర శివ, బుజ్జి దంపతుల ఏకైక కుమారుడు అజ్మీర అశోక్(34) మోటారు సైకిల్‌పై టేకులపల్లి నుంచి ఇంటికి సులానగర్ వస్తున్నాడు. లారీ ఆఫీసు సమీపంలో రోడ్డు ప్రక్కన నిలిపి ఉంచిన టిప్పర్‌ను వెనుకనుంచి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన అశోక్‌ను కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

బిల్లుపాడులో బైక్ చోరీ

తల్లాడ, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బిల్లుపాడుకు చెందిన చింతల సావిత్రి ఇంటి లోని ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఆమె కుమార్తె వైద్యం కోసం సోమవారం హైదరాబాద్ వెళ్లారు. తిరిగి బుధవారం రాత్రి ఇంటికి వచ్చారు. ఇంట్లో పెట్టిన బైక్ కనిపించలేదు. దీంతో స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

బాలికపై లైంగిక దాడి కేసులో జీవితఖైదు

ఖమ్మంలీగల్‌ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడి ఘటనలో ఖమ్మంలోని రమణగుట్టకు చెందిన కె.సంపత్, పి.నవీన్‌కు జీవితఖైదు తోపాటు రూ.2లక్షల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి గురువారం తీర్పుచెప్పారు. ఫిర్యాది కథనం ప్రకారం.. తమ కూతురు సాయంత్రం ఇంటి పక్కన ఉన్న ఇంటిలో ఆడుకుంటోంది. ఈ నేపథ్యంలో నిందితులు మాయ మాటలుచెప్పి మోటార్ సైకిల్‌పై తీసుకొని పోయి లైంగిక దాడి చేశారు. ఈ ఘటనపై ఖమ్మం ఖానాపురంహవేలి పోలీసులకు 2021లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలుచేయగా, కేసును విచారించిన న్యాయాధికారి నిందితులపై నేరం రుజువు కావటంతో పైవిధంగా తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుఫున పబ్లిక్ ప్రాసికూటర్ ఎ.శంకర్ వాదించగా కోర్టు లైజనింగ్ అధికారి కె.శ్రీనాథ్,కోర్టు కానిస్టేబుల్‌గా డీ.శ్రీనివాసరావు హోంగార్డు ఆయూబ్ సహకరించారు.

గుండెపోటులో ఇద్దరి హఠాన్మరణం

మంగువాయిబాడవలో క్రీడాకారుడు, మణుగూరులో హమాలీ



చరణ్‌బాబు



యాకూబ్‌రెడ్డి

దుమ్ముగూడెం,ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): మంగువాయిబాడవకు చెందిన క్రికెట్ క్రీడాకారుడు కల్లూరి చరణ్‌బాబు(36) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. పదిన్నర గంటల సమయంలో గుండెపోటు రాగా, ములకపాడు పీహెచ్‌సీకు తరలించారు. వైద్య చికిత్సలు పొందుతూ మృతిచెందాడు. శుక్రవారం పలువురు క్రీడాకారులు చరణ్‌బాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. చుట్టు ప్రక్కల మండలాల క్రికెట్ క్రీడాకారులకు సుపరిచితుడైన చరణ్ మృతి వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

మణుగూరుటౌన్: మణుగూరులో హమాలీ మేస్త్రీ గురువారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. సంతోష్ నగర్ ప్రాంతానికి చెందిన కమ్మం యాకూబ్‌రెడ్డి (50) ఓకిరాణా షాపు గోదాం నుంచి మంచినూనే డబ్బాలను తీసుకుని వస్తుండగా గుండెపోటుకు గురైకుప్ప కూలిపోయాడు. సాటిహమాలీలు వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతునికి భార్య మంజుల, కుమారుడు బాను ప్రకాష్, కుమార్తె పూజిత ఉన్నారు.

సాగర్ కాల్వలో పడి హోంగార్డు మృతి



నరేష్(ఫైల్)

నేలకొండపల్లి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోమ్‌గార్డు గంటా నరేష్ ప్రమాదవశాత్తు నాగార్జున సాగర్ కాల్వలో పడి మృతి చెందాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన నరేష్(40) తన ద్విచక్రవాహనాన్ని మరమ్మత్తుల నిమిత్తం మెకానిక్ దగ్గర ఇచ్చాడు. మెకానిక్ దగ్గర వేరే వాహనం తీసుకుని కటింగ్ చేయించుకుని అటునుంచి, అటే స్నానం చేయటానికి కూసుమంచి రోడ్డులోని నాగార్జున సాగర్ ప్రధాన కాల్వ వద్దకు వెళ్లాడు. స్నానం చేయటానికి దుస్తులు విప్పి ద్విచక్రవాహనంపై వేసి, చెప్పులు, మొబైల్ అక్కడనే పెట్టి కాల్వలోకి దిగాడు. ప్రమాదవశాత్తు కాలుజారి కాల్వలో కొట్టుకుని పోయాడు. గురువారం ఉదయం కాల్వపై పనుల నిమిత్తం తిరుగుతున్న లస్కర్, ఇంకో వ్యక్తి సవర్‌ప్లాంట్ వద్ద మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. కాల్వలోనుంచి మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం హోంగార్డు నరేష్‌దిగా గుర్తించారు. అక్కడకు సమీపంలోనే ద్విచక్రవాహనం, బట్టలు, మొబైల్, చెప్పులు గుర్తించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య నాగరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేలకొండపల్లిలో విషాదం...

భేషజం లేకుండా అందరితో కలిసిమెలిసి ఉండే నరేష్ మృతి సమాచారంతో నేలకొండపల్లిలో విషాదం నెలకొంది. పోలీస్ సిబ్బంది దాగ్భాంతికి గురయ్యారు. కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్‌ఐ సంతోష్‌లతో పాటుగా పోలీస్ సిబ్బంది, హోమ్‌గార్డులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబానికి తీవ్ర సంతాపం తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో ఏడాది జైలు

భద్రాచలం,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కుల కేసుల్లో భద్రాచలానికి చెందిన ఎస్.నరసింహాచార్యులకు ఆరునెలల చొప్పున రెండు కేసుల్లో ఏడాది జైలుశిక్ష, నాలుగు లక్షల రూపాయల నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించారు. ఈమేరకు భద్రాచలం ప్రథమశ్రేణి న్యాయాధికారి శివనాయక్ గురువారం తీర్పు వెల్లడించారు. నరసింహాచార్యులు రెండు చెక్కులను హామీగా పెట్టి రాంప్రసాద్‌రాజు వద్ద రూ.2లక్షలు, పద్మరాణి వద్ద రూ.2 లక్షలు నగదు తీసుకున్నారు. హామీగా ఇచ్చిన చెక్కులు బ్యాంకులో జమ చేయగా, నిరాదరణకు గురయ్యాయి. దీంతో వారు కోర్టును ఆశ్రయించారు.

ఇసుక లారీ పట్టివేత

బూర్గంపాడు,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీని గురువారం బూర్గంపాడు పోలీసులు పట్టుకున్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాకలో గురువారం అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఐ రాజేష్ దాడులు నిర్వహించారు.దాడుల్లో భాగంగా సారపాక గ్రామ శివారులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకను లారీలో లోడ్ చేసుకుని వెళ్తుండగా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ వెంకన్న, యాజమాని రామకృష్ణపై కేసు నమోదు చేశారు.

30మందిపై బైండోవర్ కేసులు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేస్తున్న బెల్టుషాపుల యజమానులపై కేసులుపెట్టి తహసీల్దార్ ఎదుట గురువారం హాజరుపరిచారు. కొక్కిరేణి, ఎర్రగడ్డ, గోపాలపురం, తిమ్మక్కపేట గ్రామాల్లో 30మందిపై కేసు నమోదుచేసి తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలో గురువారం జరిగింది మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు రేగళ్ల రామారావు, దొడ్డ రామారావు ద్విచక్ర వాహనంపై ఖమ్మం వెళ్లి వస్తుండగా కొక్కిరేణి స్టేజీ వద్దకు రాగానే ఖమ్మం వైపువస్తున్న కారు ఢీకొంది. ఈఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఆర్‌ఎంపీ వైద్యులు రేగళ్ల రామారావుకు తీవ్రగాయాలు కావడంతో 108 ద్వారా ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు ఘటనస్థలాన్ని ఎస్‌ఐ జగదీష్ సందర్శించారు. వివరాలు సేకరించారు. క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

ప్రకాశ్‌నగర్ ఆర్పీ తొలగింపు

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి):ఖమ్మంనగరంలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఆర్పీని తొలగిస్తూ తీర్మానించారు. ఆర్పీ అనితపై కొంతకాలంగా అవినీతి ఆరోపణలు వస్తున్నాయి. మహిళ స్వయం సహాయక సంఘంలోని సభ్యులను బ్యాంకర్లను తప్పుదోవ పట్టించి పలు ఆర్థిక ఇబ్బందులు సృష్టించారు. ఈక్రమంలో విచారణ చేపట్టిన మెప్మా అధికారులు అర్పీని విధుల నుంచి తొలగించారు. మరి కొందరిపై విచారణ జరగతుండటంతో అవినీతికి పాల్పడిన ఆర్పీలలో భయందోళన ఏర్పడింది. ఐదేళ్లుగా ఆర్థిక లావాదేవీల విషయంలో అవినీతికి పాల్పడిన మరికొందరి ఆర్పీలను తొలగించేందుకు మెప్మా అధికారులు విచారణ చేపట్టారు.

భవన వ్యర్థాలపై రూ.10వేల జరిమానా

ఖమ్మంసంక్షేమవిభాగం, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలోని ప్రధాన రహదారి వెంట భవన నిర్మాణ వ్యర్థాలపై యజమానికి రూ.10వేలు జరిమానా విధించారు. గురువారం అంబేద్కర్ సెంటర్‌లో భవనం నిర్మాణం జరుపుతూ రహదారిపై వ్యర్థాలను గుట్టలుగా పోశారు. దీంతో భవన యజమానికి పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య జరిమానా విధించారు. రహదారులపై భవనసామగ్రి ఉంచి, ఇబ్బందులుకలిగిస్తే చర్యలు తప్పవన్నారు.

యుద్ధభేరిని విజయవంతం చేయాలి

ఖమ్మంఖానాపురం హవేలి,ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏకీకృత పెన్షన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ మార్చి 2న హైదరాబాద్‌లో నిర్వహించే యుద్ధభేరి కార్యక్రమాన్ని విజయవంతంచేయాని సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్షుడు చంద్రకంటటి శశిధర్ కోరారు. గురువారం నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో యుద్ధభేరి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సురేష్, మోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లకు వేళాయే..

- జరిమానా లేకుండా మార్చి 31 వరకు అవకాశం
- ఆ తర్వాత 25శాతం జరిమానాతో రెన్యూవల్స్
- నగరంలో 6,240 ట్రేడ్ లైసెన్స్‌లు
- దళారులను నమ్మవద్దని కేఎంసీ అవగాహన



ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): వ్యాపార లైసెన్స్‌ల(ట్రేడ్‌లైసెన్స్) రెన్యూవల్స్‌కు ప్రభుత్వం ప్రకటన జారీ చేసింది. నిర్ణీత గడువులోగా వ్యాపారం చేసే ప్రతీవ్యాపారీ ట్రైడ్ లైసెన్స్‌ను పొందాల్సి ఉంటుంది. అయితే ప్రైవేట్ హాస్పటల్స్ నిర్వాహకులు మాత్రం తమది వ్యాపారం కాదని, ఆరోగ్య సేవలు అందిస్తున్నామని కోర్టుకు వెళ్లటంతో ట్రైడ్ లైసెన్స్‌ల రూపంలో కేఎంసీకి రావాల్సిన ఆదాయానికి గండి పడుతుంది.

రహదారి మేరకు ఫీజు నిర్ణయం

ఖమ్మం నగరంలో 10వేలకు పైగా కమర్షియల్ వ్యాపారాలు జరుగుతున్నాయి. కానీ అధికారికంగా 6,240 ట్రైడ్‌లైసెన్స్‌లు మాత్రం ఖమ్మం నగర పాలక సంస్థలో నమోదు జరిగాయి. ప్రతీ కమర్షియల్ వ్యాపార దుకాణం ఎదుట ఉన్న రహదారి వెడల్పును అనుసరించి ట్రైడ్ లైసెన్స్ ధరను నిర్ణయిస్తారు. వ్యాపార దుకాణానికి ముందు ఉన్న రహదారి 30అడుగుల లోపుగా ఉంటే కమర్షియల్ వ్యాపార భవనంలో ప్రతీ స్కేర్ ఫీట్‌కు రూ.3 చెల్లించాల్సి ఉంటుంది. 30అడుగుల నుంచి 50 అడుగుల రహదారి ఉంటే స్కేర్ ఫీట్‌కు రూ.4ధర చెల్లించాల్సి ఉంటుంది. 50అడుగులకు మించి ఎంత పెద్ద రహదారి ఉన్నా కూడా స్కేర్ ఫీట్‌కు రూ.5 ధరగా అధికారులు నిర్ణయించారు.

మార్చి 31 వరకు జరిమానా లేకుండా

రాబోయే ఏడాది కాలానికి ముందు సంవత్సరం మార్చిలోపుగానే ట్రైడ్‌లైసెన్స్‌లు వ్యాపారులు పొందాల్సి ఉంటుంది. 2025-2026 ఏడాదికి గాను ప్రభుత్వం ఏటా వలే నోటిఫికేషన్ విడుదల చేసింది. వ్యాపారులు మార్చి 31లోపుగా తమ ట్రైడ్ లైసెన్స్‌లు రెన్యూవల్స్ చేయించుకోవాల్సి ఉంటుంది. లేకుంటే తర్వాత మూడు నెలల కాలానికి 25శాం, ఆరునెలల కాలానికి 50శాతం జరిమాన విధిస్తారు.

కమర్షియల్ వ్యాపారం కాదంటున్న ఆస్పత్రి వర్గాలు

ఖమ్మం నగరంలో 120కు పైగా ప్రవేట్ హాస్పటల్స్ ఉన్నాయి. అయితే తమకు కమర్షియల్ వ్యాపారం కాదని ఆరోగ్య సేవా అంటూ ట్రైడ్ లైసెన్స్‌లు వర్తించబోవని హాస్పటల్స్ నిర్వాహకులు కోర్టుకు వెళ్లారు. దీంతో రెండేళ్లుగా కేఎంసీ నుంచి ప్రవేట్ హాస్పటల్స్ ట్రైడ్‌లైసెన్స్‌లు తీసుకోవటం లేదు. దీంతో ప్రైవేట్ హాస్పటల్స్ నుంచి రావాల్సిన రూ.50లక్షల లైసెన్స్ ఫీజులు బకాయిలు పెరిగాయి.

దళారులను నమ్మి మోసపొవద్దు

ట్రైడ్ లైసెన్స్‌లు ఇప్పిస్తామంటూ కొంతకాలంగా ఖమ్మంనగర పాలక సంస్థకు వచ్చే దళారుల సంఖ్య పెరిగింది. దీంతో కేఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ట్రైడ్ లైసెన్స్‌లను కేఎంసీ కార్యాలయంలో రెన్యూవల్స్ చేయించుకోవాలని ఈ మేరకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయా ప్రాంతాల జవాన్లతో నోటీసులు పంపుతున్నారు. సెల్‌ఫోన్లలకు వాట్సాప్ ఎల ద్వారా సందేశాలను వ్యాపారులకు అందిస్తున్నారు. దళారులమాటలు నమ్మవొద్దని కేఎంసీ రెవెన్యూ అధికారులు కోరుతున్నారు.

పీహెచ్‌సీ కేంద్రం తనిఖీ

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని ఎమ్ వెంకటాయపాలెం గ్రామంలోని పీహెచ్‌సీ కేంద్రాన్ని గురువారం జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కళావతిబాయ్ సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్నటువంటి కార్యక్రమాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 30 సంవత్సరాలు దాటిని ప్రతి ఒక్క వ్యక్తి బీపీ, షుగర్ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బాలకృష్ణ, ఎస్ఎన్.చంద్రకళ, అజార్,సంతోష్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

శివస్వాముల ఇరుముడి

కూసుమంచి,ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కూసుమంచిలోని శివాలయంలో గురువారం శివమాలాధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని 41రోజుల పాటు నిష్టతో మాలధరించిన భక్తులు ఇరుముడి ధరించారు. సుమారు 200మందికి పైగా భక్తులు మహిమాన్విత పుణ్యక్షేత్రమైన శ్రీశైలక్షేత్రానికి శివస్వాములు శివాలయం నుంచి ర్యాలీగా బయలుదేరివెళ్లారు.

వధూవరులకు మంత్రి ఆశీర్వాదం

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిరిపురం మాజీ సర్పంచ్ బోడపట్ల నరసయ్య సునిత దంపతుల కుమార్తె సుమాంజలిని గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆశీర్వదించారు. మహ్మదాపురంలో నూతన వధూవరులను ఆశీర్వదించి నూతన వస్త్రాలు బహుకరించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణ, మాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, నాయకులు బోడపట్ల నరసయ్య, ఓర వెంకటేశ్వర్లు, రామడుగు ప్రభాకరరావు, సుమన్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ విస్తరణకు పనిచేయాలి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): సీపీఎం గ్రామస్థాయి నుంచి పటిష్టపరచాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండి రమేష్ కోరారు. గురువారం పార్టీ కార్యాలయంలో పద్మనాభుల సుధాకర్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కార్యకర్తలు నిరంతరం శ్రమించాలన్నారు. ఈసమావేశంలో పార్టీ మండల ఇన్‌చార్జి బషీరుద్దీన్ మండల కార్యదర్శి కొమ్ము శ్రీను, బింగి రమష్, నాగేశ్వరరావు, వెంకన్న, మంగపతి, లింగయ్య, వీరన్న, రాములు పాల్గొన్నారు

అల్పాహారం పంపిణీ

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): నగరంలోనిపాకబండబజార్‌లోని స్థానిక ప్రజలు సుమారు 200మందికి గురువారం రామకృష్ణ ట్రస్టు ఆధ్వర్యంలో అల్పాహారం అందించామని ట్రస్టు చైర్మన్ మోతకూరి చంద్రకళ తెలిపారు. పేదలకు సేవచేయాలనే ఉద్దేశంతో ట్రస్టుఏర్పాటుచేశామని, మున్ముందు పేద ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో గజ్జెల ఓదేలు, చిట్టిబాబు, శ్రీనివాస్, మహేష్, ఉష, మానస తదితరులు పాల్గొన్నారు.

సెమీస్ దశకు రాజీవ్ క్రికెట్ పోటీలు

ఖమ్మంస్పోర్ట్స్,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు సెమీస్ దశకు చేరుకున్నాయి. బుధవారం జరిగిన లీగ్ పోటీలలో విజయం సాధించిన కల్లూరు, మణుగూరు జట్లు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఐదోరోజు పోటీలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ లింగుస్వామి క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. మణుగూరు జట్టుకు చెందిన దివ్యాంగ క్రీడాకారుడు లాలయ్య తన అద్భుత బౌలింగ్‌తో ప్రేక్షకులను అలరించాడు.

సేవాలాల్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

ఖమ్మంచర్చికాంపౌండ్,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): సేవాలాల్ స్ఫూర్తితో ముందుకు సాగాలని 4వడివిజన్ కార్పొరేటర్ దండా జ్యోతిరెడ్డి అన్నారు గురువారం ఖానాపురంలోని సేవాలాల్ మహారాజ్ ఆలయంలో సేవాలాల్ జయంతి వేడుకలను నిర్వహించారు. తొలుత సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రవికిరణ్, బానోతు కిషన్‌నాయక్, బిక్కునాయక్, భూక్యా శోభన్‌నాయక్, కొట్టె సుదాకర్ తదిరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

ఖమ్మంబైపాస్‌రోడ్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ అభ్యర్థి పులి సర్వోత్తమరెడ్డిని గెలిపించాలని కోరుతూ రాష్ట్ర బీజేపీ నాయకుడు గంటేల విద్యాసాగర్ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. నగరంలోని ఎన్ఎస్‌పీకెనాల్ ప్రభుత్వ పాఠశాల, రిక్కాబజార్ పాఠశాల, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు.

విద్యార్థులు బాగా చదవాలి

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



విద్యార్థులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్

ఖమ్మం,ఖానాపురంహవేలిఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి, మరోనలుగురి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం కలెక్టర్ నగరంలోని శాంతినగర్ ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 47మందికి వివిధ పరీక్షల మెటీరియల్ అందించారు. ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు కోసం అవసరమైన శిక్షణ,పుస్తకాలుఅందించేందుకు మలబార్ గోల్డ్ చారిటబుల్ సంస్థ నగదు ప్రోత్సాహంగా రూ.3లక్షల80 వేల చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. తల్లిదండ్రులు చాలా కష్టపడి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారని, ఇందులో కొందరు ఆర్థికంగా స్థిరంగా ఉంటారని,కొందరు పేదరికం లో ఉంటారని, వారిని చూసి స్ఫూర్తిపొంది సమాజంలో అగ్రస్థాయికి చేరుకునేందుకు బాగా చదువుకోవాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన మలబార్‌గోల్డ్ సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇంటర్మీ డియట్ అధికారి రవిబాబు, కళాశాల ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పవన్, భరత్ కుమార్, రాణి, శ్రీనివాస్, కిరణ్, మలబార్ సంస్థ జిల్లా హెడ్ విష్ణు, మేనేజర్ రామారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎంని కలిసిన గ్రానైట్ స్లాబ్ అసోసియేషన్ నాయకులు


ముఖ్యమంత్రికి మొక్కను అందిస్తున్న నాయకులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఖమ్మం గ్రానైట్ స్లాబ్ అసోసియేషన్ నాయకులు జిల్లా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం ముఖ్యమంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రానైట్ సమస్యలపై ముఖ్యమంత్రికి వినతితిపత్రం అందించారు. ఈసమస్యలను మైన్స్ సెక్రటరీ నుంచి వివరాలు తీసుకుని కేబినేట్ సమావేశంలో పరిష్కారానికినిర్ణయం తీసుకుంటానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టు జిల్లా స్లాబ్ అసోసియేషన్ అధ్యక్షుడు పాటిబండ్ల యుగంధర్ తెలిపారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సాధురమేష్‌రెడ్డి, స్లాబ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సుగుణమ్మకు నివాళి

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కిరేణి మాజీ సర్పంచ్ చావా సుగుణమ్మకు గురువారం వివిధ పార్టీల నేతలు ఘననివాళులర్పించారు. ఆమె ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం దశదిన కర్మ నిర్వహించారు. ఆమెచిత్రపటానికి సీపీఐరాష్ట్ర కార్యవర్గ సభ్యులు బాగం హేమంతరావు, డీసీసీబీ డైరెక్టర్ చావా వేణు, చావా శివరామకృష్ణ, బెల్లం శ్రీను తదితరులు నివాళులర్పించారు.

ఘనంగా అఖిల కంటి ఆస్పత్రి వార్షికోత్సవం



ఖమ్మంకలెక్టరేట్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగరంలో అఖిల కంటి ఆసుపత్రి 7వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఓపీ చాంబర్‌ను డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ప్రారంభించారు. డాక్టర్ అఖిల మాట్లాడుతూ షుగర్ వ్యాధి వలన వచ్చే రెటినా సమస్యలకు వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రతిరోజు ప్రజలకు వైద్యులు అందుబాటులో ఉంటారిని చెప్పారు. నెలలు నిండ కుండా జన్మించిన పిల్లలకు రెటీనా సంబందిత సమస్యలకు కూడా అవసరమైన ఆధునికి వైద్యసేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అఖిల వివరించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ మాధవి, మేనేజింగ్ డైరక్టర్ కుతుంబాక మధు, డాక్టర్ సమత, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సంతోష్, డాక్టర్ గౌతమ్ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

తీర్థాల జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి

- ఆర్డీవో నరసింహారావు
- అధికారుల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో నరసింహారావు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి): ఈనెల 26నుంచి ఐదు రోజుల పాటు జరిగే తీర్థాల సంఘమేశ్వర స్వామి జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో నరసింహారావు అన్నిశాఖల అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని తీర్థాల సంఘమేశ్వరాలయంలో గురువారం జాతరకు సంబందించి అన్నిశాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. భక్తులకు మంచినీటిని అందించాలన్నారు. జాతర నలువైపులా ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక గదులు ఏర్పాటుచేయాలన్నారు. వాటితో పాటు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్‌కు సంబందించి పంచాయతీ అధికారులు ఎక్కువ మంది సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతి వర్కర్లకు ప్రత్యేక డ్రస్‌కోడ్ ఏర్పాటు చేయాలన్నారు. మున్నేరులోకి చెక్ డ్యాంనుండి మోటర్లతో నీరు కిందకు వదిలేలా చూసుకోవాలని నీటిపారుదల శాఖాధికారులకు సూచించారు. ఎక్కువ బస్సులను కేటాయించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జాతర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ రాంప్రసాద్, సీఐ రాజు, ఆలయ ఈవో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమిత డొంక దారికి విముక్తి

- ఏళ్లనాటి డొంకను స్వాధీనం చేసుకున్న అధికారులు


డొంక ఆక్రమణ తొలగింపును పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

ఖమ్మంరూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఏండ్ల తరబడి నుంచి కబ్జాకు గురైన రైతులకు సంబందించిన డొంక రహదారిని రెవెన్యూ అధికారులు వెలికి తీశారు. ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని గుర్రాలపాడు రెవెన్యూ పరిధిలోని సత్యసంకల్ప వెంచర్‌లో సర్వే నంబర్ 51, 52లకు మధ్యలోగల నక్షా పూర్వపు రెవెన్యూ డొంక రహదారి కబ్జాకు గురైంది. దానిపై గ్రామస్థుల ఫిర్యాదు మేరకు రూరల్ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్, ఆర్ఐ ప్రసాద్ గురువారం అట్టి భూమి వద్ద సర్వే నిర్వహించారు. జేసీబీల ద్వారా పునరుద్ధరించారు. ఆక్రమణకు గురైన డొంక సుమారు 10 కుంటల భూమి ఉంటుందని దాని విలువ సుమారు మార్కెట్ విలువ ప్రకారం రూ.2.50కోట్లు విలువ ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

డిజిటల్ దిశగా స్త్రీనిధి రుణాల చెల్లింపు

- డీఎంసీ సుజాత, ఆర్ఎం రవీంద్రనాయక్
- ఆర్పీల అవగాహన సమావేశం


మాట్లాడుతున్న ఆర్ఎం రవీంద్ర నాయక్

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలను డిజిటల్ చెల్లింపులు జరగనున్నయి. దీనిపై ఆర్పీలు అవగాహన కల్పించాలని ఖమ్మం మెప్మా డీఎంసీ సుజాత, పీడీ మహేందర్, స్త్రీనిధి రీజనల్ మేనేజరు రవీంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆర్పీల అవగాహన సమావేశంలో ఆయన పలు అంశాలను వివరించారు. స్త్రీనిధి రుణాల రికవరీ సందర్భంగా పారదర్శకంగా ఆర్పీలు వ్యవహరించాలన్నారు.రుణాలను సకాలంలో రికవరి చేసిన ఆర్పీలకు మంచి ప్రోత్సహాకాలుఇవ్వటం జరుగుతుందన్నారు. గతంలో ఒక్కోఆర్పీ రూ.40వేల నుంచి రూ.60 వేల వరకు ప్రోత్సహకాలు తీసుకున్నారని గుర్తు చేశారు.టీఎంసీ గుడిపూడి శారదరాణి, సీవోలు ఉపేందర్, సల్మా, ద్రౌపతి, రోజా పాల్గొన్నారు.

ఆంగ్ల విద్యపై అంగన్‌వాడీలకు శిక్షణ


అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆంగ్ల విద్యను అందించాలనే లక్ష్యంతో గురువారం నగరంలోని టేకులపల్లి డబుల్ బెడ్‌రూంలోని అంగన్‌బాడీ కేంద్రంలో శిక్షణ ఇచ్చారు. 20మంది అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక శిక్షన అందిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంఅర్బన్ ప్రాజెక్టు పరిధిలోని స్మార్ట్ టీవీలు అందుబాటులో ఉన్న కేంద్రాల టీచర్లకు శిక్షణ అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వీరభద్రమ్మ, సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు సంస్థ శిక్షకులు పాల్గొన్నారు. కాగా గతంలో అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీస్కూల్ విద్య పేరుతో జిల్లాలో ప్రాజెక్టులో రెండు అంగన్‌వాడీ కేంద్రాలను తీసుకోని వాటిని రంగురంగులతో తీర్చిదిద్దిన అధికారులు ఆ విద్యను పక్కన పెట్టేశారనే విమర్శలు వినపడుతున్నాయి. ఈ ప్రీ స్కూల్ విద్యలోనే ఆంగ్ల విద్యకు సంబందించిన ప్రత్యేక పుస్తకాలను ముద్రించి టీచర్లకు శిక్షణ అందించారు. ప్రస్తుతం ఓ ఎన్‌జీవోతో టీచర్లకు శిక్షణ అదీ టీవిలు అందుబాటులో ఉన్న కేంద్రాలకే అంటూ ప్రత్యేకంగా చెప్పటంతో మిగిలిన టీచర్ల కేంద్రాలకు టీవిలు ఎవ్వరు అందించాలని వారు ప్రశ్నిస్తున్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కొణిజర్ల,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోపతి, మల్లుపల్లి గ్రామాల్లో గురువారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పర్యటించారు. ఇటీవల చనిపోయిన బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెద్దగోపతిలో తడికమళ్ళ రవి చిత్రపటం వద్ద ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ నివాళులర్పించారు. మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో ఇటీవల హైదరాబాద్‌లో షల్లార్‌లో గోడకూలి మృతి చెందిన ఆలకుంట వీరయ్య, ఆటకుంట రాము, ముద్దంగుల శ్రీనివాసుల చిత్రపటాలకు నివాళులర్పించి, కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, ఓబీసీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, కోసూరి శ్రీను, చెరుకుమల్లి రవి, దర్శి చెన్నారావు, చింతనిప్పు నరసింహారావు పాల్గొన్నారు.

డిజిటల్ దిశగా స్త్రీనిధి రుణాల చెల్లింపు

» డీఎంసీ సుజాత, ఆర్ఎం రవీంద్రనాయక్

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలను డిజిటల్ చెల్లింపులు జరగనున్నాయి. దీనిపై ఆర్పీలు అవగాహన కల్పించాలని ఖమ్మం మెప్మా డీఎంసీ సుజాత, పీడీ మహేందర్, స్త్రీనిధి రీజనల్ మేనేజరు రవీంద్రనాయక్ పేర్కొన్నారు. గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆర్పీల అవగాహన సమావేశంలో ఆయన పలు అంశాలను వివరించారు. స్త్రీనిధి రుణాల రికవరీ సందర్భంగా పారదర్శకంగా ఆర్పీలు వ్యవహరించాలన్నారు.రుణాలను సకాలంలో రికవరి చేసిన ఆర్పీలకు మంచి ప్రోత్సహకాలుఇవ్వటం జరుగుతుందన్నారు. గతంలో ఒక్కోఆర్పీ రూ.40వేల నుంచి రూ.60 వేల వరకు ప్రోత్సహకాలు తీసుకున్నారని గుర్తు చేశారు.టీఎంసీ గుడిపూడి శారదరాణి, సీవోలు ఉపేందర్, సల్మా, ద్రౌపతి, రోజా పాల్గొన్నారు.

దుమ్ముతో పరేషాన్..

» ఇబ్బందులు పడుతున్న వాహనదారులు


రోడ్డుపై లేచిన దుమ్ముతో ప్రయాణికుల ఇక్కట్లు

వైరా, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మధిర-జగ్గయ్యపేట రోడ్డులో విపరీతమైన దుమ్ము లేస్తుండటంతో ప్రయాణికులు, ఈ రోడ్డు వెంట ఉన్న దుకాణాలు, నివాసాల వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దాదాపు నాలుగునెలల నుంచి వైరాలో ఈ దుమ్ముతో ప్రజలు అనారోగ్యాల భారీనపడుతున్నారు. మరీ ముఖ్యంగా నెలరోజుల నుంచి ఎగిసిపడుతున్న దుమ్ముతో ప్రజలు శ్వాసకోశ సంబంధ వ్యాధి భారీనపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఈ రోడ్డు వెంట ఉన్న దుకాణాలు, నివాసాల నిండా దుమ్ము పేరుకుపోతుంది. రూ.12కోట్లతో నాలుగులైన్ల రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. ఈ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకను తలపిస్తున్నాయి. ఇందిరమ్మ కాలనీ నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు మట్టి, వెట్‌మిక్స్‌తో పనులు చేశారు. ఇప్పుడు కమ్మవారి కల్యాణ మండపం దగ్గరి నుంచి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల గేటు ముందు భాగం వరకు బీటీ రోడ్డు తవ్వి మట్టి నింపుతున్నారు. వెట్‌మిక్స్, మట్టి పనులు చేస్తున్న రెండుచోట్ల కూడా వాటర్‌క్యూరింగ్ చేయడం లేదు. ఉదయం, సాయం త్రం కంటి తుడుపుగా రెండుసార్లు మాత్రమే వాటర్ క్యూరింగ్ చేస్తున్నారు. మిగిలిన సమయాల్లో వాటర్ క్యూరింగ్ లేక వాహనాల రాకపోకల సమయంలో టైర్ల వెంట విపరీతమైన దుమ్ము లేస్తుంది. జగ్గయ్యపేటకు వేలాది యాష్, బొగ్గు లారీలు అలాగే కొత్తగూడెం, సత్తుపల్లి వైపు సిమెంట్, బొగ్గుతో వెళ్లిన ఖాళీ లారీలు, అలాగే మధిరకు ఆర్టీసీ బస్సులు, లారీలు, వేలాది కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాలతో ఈ రోడ్డు విపరీతమైన రద్దీతో ఉంటుంది. దీనికితోడు గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ హైలెవల్ వంతెన సమీపంలో కూడా సరైన వాటర్ క్యూరింగ్ లేక విపరీతమైన దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ వలన రెండు సంవత్సరాల నుంచి దుమ్ముతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఆర్అండ్‌బీ, గ్రీన్‌ఫీల్డ్ హైవే అధికారులు, కాంట్రాక్టర్లు తగు చర్యలు తీసుకొని వాటర్ క్యూరింగ్‌తో దుమ్ము బారీ నుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.

షాదీఖానా నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయిస్తాం


మంత్రి పొంగులేటితో మసీదు కమిటీ సభ్యులు

» మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వైరా, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): వైరాలో అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మానాన్ని వెంటనే పూర్తిచేస్తామని రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. గురువారం వైరాలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో కలిసి మంత్రి పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మసీదు కమిటీ సభ్యులు మంత్రిని కలిసి అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణాన్ని పూర్తిచేయాలని ఈద్గా స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్లు బొర్రా రాజశేఖర్, తుళ్లూరి బ్రహ్మయ్య, మునిసిపల్ మాజీ వైస్ ఛైర్మన్ సూతకాని జైపాల్, షేక్ సోందు సాహెబ్, సయ్యద్ అన్వర్, రసూల్, మీరా, గౌస్, వలీజాన్, నాయకులు పణితి సైదులు, దార్న రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూలరవీందర్‌ను మెజార్టీతో గెలిపించాలి

» మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ పురుషోత్తంరావు పటేల్

తల్లాడ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) బహుజన ఉపాధ్యాయ సంఘాలు బలపరిచిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌ను గెలిపించాలని మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ సర్దార్ పురుషోత్తంరావు పటేల్ కోరారు. గురువారం తల్లాడలో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచార సమావేశంలో ఆయన మాట్లాడుతూ పూల రవీందర్ గెలుపే బహుజన కులాల భవిషత్తు మలుపు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ మహాసభ జాతీయ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర పటేల్, రాష్ట్ర అధ్యక్షుడు పర్వతం సతీష్, అశోక్, మాధురి, మధు చలమల రాధాకృష్ణ, కోసూరి వేలాద్రి, తోట శ్రీనువాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలు సాధించాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



విద్యార్థులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్

ఖమ్మం,ఖానాపురంహవేలిఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి సమాజంలో గొప్ప స్థాయికి ఎదిగి, మరోనలుగురి ఎదుగుదలకు తోడ్పాటు అందించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. గురువారం కలెక్టర్ నగరంలోని శాంతినగర్ ఏఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 47మందికి వివిధ పరీక్షల మెటీరియల్ అందించారు. ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు కోసం అవసర మైన శిక్షణ,పుస్తకాలుఅందించేందుకు మలబార్ గోల్డ్ చారిటబుల్ సంస్థ నగదు ప్రోత్సాహంగా రూ.3లక్షల80 వేల చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చిన మలబార్‌గోల్డ్ సంస్థ ప్రతి నిధులకు కలెక్టర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రవిబాబు, ప్రిన్సిపాల్ గోవిందరావు, అధ్యాపకులు పవన్, భరత్ కుమార్, రాణి, శ్రీనివాస్, కిరణ్, మలబార్ సంస్థ జిల్లా హెడ్ విష్ణు, మేనేజర్ రామారావుపాల్గొన్నారు.

సామర్థ్యాల మెరుగుతో ఉన్నతస్థాయికి విద్యార్థులు

» ఎంఈవో రాజేశ్వరరావు



విజేతలకు బహుమతులను అందిస్తున్న ఎంఈవో రాజేశ్వరరావు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని సామర్థ్యాలను మెరుగు పరచడం ద్వారా వారి మేధోశక్తిని పెంపొందిస్తూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరతారని సత్తుపల్లి ఎంఈవో నక్కా రాజేశ్వరరావు అన్నారు. స్థానిక పాత సెంటర్‌లోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ప్రతిభా పాటవ పోటీలు (టాలెంట్ టెస్ట్, క్విజ్) గురువారం నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పోటీలు విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే పునాది అని, వారిలో అంతర్గతంగా దాగి ఉన్న ప్రతభా పాటవాలను వెలికితీసి వారి సృజనాత్మకతకు పదును పెడుతూ పిల్లల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా టాలెంట్ నిర్వహణ, బహుమతులకు రూ.10వేలు అందించిన సిద్దారం పాఠశాల హెచ్‌ఎం బాలయ్యను ఘనంగా సన్మానించారు. క్విజ్ విభాగంలో ప్రథమస్థానంలో ఎన్టీఆర్ నగర్, కోటతుంబూరు నిలవగా రుద్రాక్షపల్లి, గాంధీనగర్‌లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. టాలెంట్ టెస్ట్‌లో వీ.కృష్ణచైతన్య (బూరుగు మాలపల్లి), ఎస్.గణేష్‌మూర్తి (ఎన్టీఆర్‌నగర్), కే.ఉదయ్‌కుమార్ (గంగారం) విజేతలుగా నిలవగా, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారిని అభినందిస్తూ బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంప్లెక్ ఛైర్మన్లు శైలకుమారి, పూరేటి యాకూబ్, జయరాజు, సెక్రటరీ సుధాకర్‌రెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కౌలు రైతు ఎల్లయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి'


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

చింతకాని, ఫిబ్రవరి 20(ఆంజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన కౌలు రైతు నెర్సుల ఎల్లయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం బాధిత రైతు కుటుంబాన్ని పరామర్శించారు. రైతు కుటుంబానికి రూ.5లక్షల పరిహారంతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మం జూరు చేయాలని కోరారు. మృతి చెందిన కౌలు రైతుకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని విద్యాభ్యాసం పూర్తి అయ్యేదాకా వారి బాధ్యతలు ప్రభుత్వం చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాలరావు, రాచబంటి రాము, వత్సవాయి జానకిరాములు, నన్న కృష్ణమూర్తి, పోట్ల కోటేశ్వరరావు, మేకపోతుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో సమస్యలను పరిష్కరించాలి

కారేపల్లి, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేలకాయలపల్లి గ్రామంలో ఉన్న ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఉన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయమంచ్ జాతీయ నాయకులు, తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా వీరభద్రం కోరారు. గురువారం ఆయన పాఠశాలలను సందర్శించి మాట్లాడారు. ఈకార్యక్రమంలో శోభన్ నాయక్, వినోద్, రణదేవ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతున్న నాయకులు

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


రవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

కొణిజర్ల, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దగోపతి, మల్లుపల్లి గ్రామాలలో గురువారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పర్యటించి ఇటీవల చనిపోయిన బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. పెద్దగోపతిలో తడికమళ్ల రవి చిత్రపటం వద్ద ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండల పరిధిలోని మల్లుపల్లి గ్రామంలో ఇటీవల హైదరాబాద్‌లో షల్లార్‌లో గోడకూలి మృతి చెందిన ఆలకుంట వీరయ్య, ఆటకుంట రాము, ముద్దంగుల శ్రీనివాసుల చిత్రపటాలకు ఎమ్మెల్యే పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్డే నారాయణరావు, జిల్లా నాయకులు సూరంపల్లి రామారావు, ఓబీసీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, కోసూరి శ్రీను, చెరుకుమల్లి రవి, దర్శీ చెన్నారావు, చింతనిప్పు నరసింహరావు, షేక్ మస్తాన్, జిల్లా మహేష్, పరికపల్లి శ్రీను, గడల నరేంద్రనాయుడు, పమ్మి అశోక్, జాన్ పాషా, కోటేష్ ఇనుకొండ రాంబాబు, గోపి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తాం

» విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య


విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న నాయకులు

సత్తుపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్ణయాలలో మార్పు రాకుంటే ఉద్యమ కార్యాచరణ ప్రణాళిక ప్రకటిస్తామని తెలంగాణ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య అన్నారు. గురువారం పెన్షనర్స్ డే సందర్భంగా స్థానిక సంఘ భవనంలో సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం అలసత్వం వహించడంతో తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. వృద్ధాప్య దశలో వచ్చే వ్యాధులు చికిత్సకు ఉపయోగపడే ఆరోగ్య పథకాన్ని అమలు చేయకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్ భారం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పించుకునే ధోరణితో సీపీఎస్, యూపీఎస్ వంటి పథకాలను అమలు పరిచే ప్రయత్నిం చేస్తున్నాయని, దశాబ్ధాల తరబడి ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించిన తమను వృద్ధాప్య దశలో ఆదుకోవాల్సిన బాధ్యత ఇరు ప్రభుత్వాలపై ఉందన్నారు. అనంతరం ఏడాది కాలంలో ఉద్యోగ విరమణ చేసిన 27మంది వివిధ శాఖల విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో శరత్‌బాబు, వీ.చెంచురెడ్డి, రఘుపతి రెడ్డి, బద్రుద్దీన్, కేశవరెడ్డి, ప్రకాశరావు, అద్దంకి వెంకటరత్నం, రామిశెట్టి సుబ్బారావు, బూరుగు దాసు, సీతయ్య, సాంబశివరెడ్డి, మధుసూదన రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తక్షణ పునరుద్ధరణకు స్పెషల్‌టీంలు

» ఏడీఈ కిరణ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఈ కిరణ్‌కుమార్

వైరా, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌కో వైరా సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న వైరా టౌన్, వైరా రూరల్, బోనకల్ సెక్షన్‌లలో ఏర్పడే విద్యుత్ అంతరాయాలను సరిచేసి సత్వరం వి ద్యుత్ పునరుద్ధరించేందుకు గాను స్పెషల్ టీమ్‌ను ఏర్పాటు చేశామని ఏడీఈ కిరణ్‌కుమార్ తెలిపారు. నాలుగు నెలల వేసవి ప్లాన్ కోసం ప్రత్యేకంగా ఆరుగురు సిబ్బందితో ఏర్పాటు చేసిన టీమ్ నింతరాయంగా పని చేస్తుందన్నారు. ఈ టీమ్‌కు గురువారం వస్తుసామాగ్రిన్ని ఏడీఈ కిరణ్‌కుమార్, ఏఈఈలు సుందర్‌కుమార్, వెంకటసాయి అందజేశారు.

చెరువులను సాగర్ నీటితో నింపాలని వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న రైతులు

చింతకాని, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన రైతులు గురువారం నీరు లేక ఎండిపోతున్న చెరువులను సాగర్ నీటితో నింపాలని ఆత్మకమిటీ డైరెక్టర్ కొప్పుల గోవిందరావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కూరపాటి అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని ఊరచెరువు, వడ్డెర కుంట, నేరడ రెవెన్యూ పరిధిలోని నల్లకుంట చెరువుల పరిధిలోని ఆయకట్టులో మొక్కజొన్న, వరి పంట సాగు చేశామని, చెరువులలో నీరు అడుగంటి పోతుందని వెంటనే చెరువులను సాగర్ జలాలతో నింపాలని కోరారు. కార్యక్రమంలో రైతులు గురిజాల మాధవరావు, కొమ్ము జానురాజు, తుంగా సుధాకర్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాల స్థలానికి నగదు వితరణ


ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందిస్తున్న చందర్‌రావు, రమేష్

కల్లూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్, మారేమ్మ దేవాలయాలకు కల్లూరు చెందిన దాతలు చిక్కుల అప్పయ్య కుటుంబ సభ్యులు రూ.2.15లక్షల నగదును వితరణ చేశారు. గురువారం లక్ష్మీపురంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు. దాత చిక్కుల రమేష్‌ల సమక్షంలో నగదు చెక్కును ఆలయాల కమిటీ సభ్యులకు అందజేశారు. లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించనున్న సంత్‌శ్రీ సేవాలాల్, మారేమ్మ ఆలయాల నిర్మాణానికి గాను స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు రెండు కుంటల స్థలం కొనుగోలుకు దాతలు చిక్కుల కుటుంబ సభ్యులు వెంకట రామారావు, రమేష్, మురళీకృష్ణ, సోదరి గంధం స్వరాజ్య లక్ష్మిలు పై నగదును వితరణ చేశారు. వారికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, టీవి ప్రసాద్, ధర్మా, గుగులోతు నాగరాజు, బూక్యా రవీందర్, గుగులోతు ప్రసాద్, తులిశా, గ్రామస్థులు పాల్గొన్నారు.

గుంతలమయంగా మల్లారం-నెమలి రోడ్డు

» పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

» మరమ్మతులు చేపట్టాలని వినతి

మధిరటౌన్, ఫిబ్రవరి20(ఆంధ్రజ్యోతి): సిరిపురం నుంచి మల్లారం మీదుగా ఆంధ్రాలోని పుణ్యక్షేత్రం నెమలికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాటు తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. అనేక ఏళ్లుగా ఈ రహదారి ఆసాంతం గుంతలమయంగా మారడంతో గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు మరమ్మతులకు నిధులు మంజూరై, పనులు ప్రారంభం కానున్న తరుణంలో ఎన్నికల కోడ్‌తో పనులు ఆగిపోయాయి. ఎన్నికల తరువాత పనులు ప్రారంభించి సంవత్సరం కావస్తున్నా పనులు పూర్తి కాకపోవడంతో ఆ రహదారిలో ప్రయాణం నరకంగా మారింది.

దీంతో పాటు విపరీతంగా దుమ్ము లేస్తుండటంతో రోడ్డు కనపడకుండా పోతుంది. అందుకు తోడు రొంపిమళ్ల సమీపంలో ఉన్న యండపల్లి గుట్ట నుంచి గ్రావల్ తోలుకునేందుకు అమరావతి-నాగపూర్ హైవే కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో రోజుకు వందకు పైగా భారీ టిప్పర్లు తిరుగుతుండటంతో మరింత పెద్ద గోతులు రోడ్డుపై ఏర్పడ్డాయి. మరో పదిహేను రోజుల్లో ఆంధ్రాలోని నెమలి వేణగోపాలస్వామి కల్యాణం సందర్భంగా తిరునాళ్ల జరగనుండడంతో మూడు రోజుల పాటు వేలాది వాహనాలు ఈ మార్గం గుండా ప్రయాణించాల్సి రావడంతో అప్పటిలోగా కనీసం గోతులను అయినా పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.


మల్లారం సమీపంలో కుంగిన రోడ్డు

మరమ్మతులు చేపడతాం..

● ఆర్అండ్‌బీ జేఈ రాంబాబు

సిరిపురం నుంచి నెమలి రోడ్డులో తెలంగాణ బోర్డర్ వరకు రూ.22 కోట్లతో డబుల్ రోడ్డు మంజూరై టెండర్ కూడా పూర్తయింది. అందుకే మరమ్మత్తులు చేసిన దగ్గర బీటీ వేయలేదు మరో నెల రోజుల్లో రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమవుతాయి. ఈ లోగా గుంతలను పూడిపిస్తాం.

ఇబ్బందులు పడుతున్నాం..



● మందడపు ఉపేందర్ రావు, మాజీ సర్పంచ్ మల్లారం

జాతీయ రహదారులకు యండపల్లి గుట్ట నుంచి భారీ వాహనాలతో గ్రావెల్ తోలుతుండటంతో రొంపిమళ్ల నుంచి సిరిపురం వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. దీనితో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. త్వరగా రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలి.